

పండుటాకులకు..

పింఛన్ పరీక్ష



మదనపల్లె జిల్లా ఆసుపత్రిలో పింఛన్‌దారుడి కంటిని పరీక్షిస్తున్న వైద్యుడు

- అర్హత నిరూపణకు అవస్థలు
- వికలత్వంపై రీవెరిఫికేషన్
- మానసిక బాధితులు కడపకు..
- కంటి పరీక్షకు మదనపల్లెకు పరుగులు
- జిల్లాలో 26,389 మందికి వైద్య పరీక్షలు

మదనపల్లె, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పథకం కింద వృద్ధులు, వికలాంగులకు ఇస్తున్న పింఛన్లపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలో భాగంగా అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం దానిని అమలు చేస్తోంది. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల అర్హతపై రీవెరిఫికేషన్ చేయిస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే బెడ్‌రీడెన్‌తో ఇంట్లో మంచానికే పరిమితమైన వ్యాధిగ్రస్తులపై విచారణ చేపట్టగా తాజాగా వికలాంగుల పింఛన్లపై కూడా అదే తరహాలో అర్హతను పరీక్షిస్తోంది. వైసీపీ ప్రభుత్వంలో బెడ్‌రీడెన్ రోగులకు రూ.5 వేలు ఇచ్చేది. దానిని కూటమి ప్రభుత్వం ఒకేసారి ఏకంగా రూ.15 వేలకు, వికలాంగులకు వికలత్వశాతాన్ని బట్టి రూ.6 వేలు, వితంతు, ఇతరులకు ఇస్తున్న పింఛన్ రూ.4 వేలకు పెంచింది. ఇందులో భాగంగా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పెంపును అమలు చేస్తోంది. అంతవరకూ బాగానే ఉన్నా ప్రస్తుతం క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల అర్హతను పరీక్షిస్తోంది. ఇందులో భాగంగా రూ.15 వేలు అందుకుంటున్న లబ్ధిదారులపై రెండు నెలల క్రితం వైద్యబృందాలను ఇంటింటికీ పంపి అర్హతలపై రీవెరిఫికేషన్ చేయించింది. అలాగే రూ.6 వేలు అందుకుంటున్న వికలాంగులపై కూడా మరోసారి సంబంధిత వైద్యుడి చేత పరీక్షిస్తోంది.

జిల్లాలోని మదనపల్లె, రాయచోటి, రాజంపేట మున్సిపాలిటీ, బి.కొత్తకోట నగర పంచాయతీతో పాటు 30 మండలాల్లో 2.17 లక్షల మంది పింఛన్‌దారులు ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. తలశిల బాధితులు (మంచానికే పరిమితమైన), డయాలసిస్ (కిడ్నీ) బాధితులు, వృద్ధులు, వికలాంగులు, మానసిక, శారీరక రోగులు, డప్పు కళాకారులు, చేనేత, ట్రాన్స్‌జెండర్, మత్స్యకారులు, రాజకీయ బాధితులు, తదితర 23 రకాల పింఛన్లు ఉన్నాయి. ఇందులో మంచానికే పరిమితమైతమ పని తాము చేసుకోలేని స్థితిలో ఉన్న వారు 1611 మంది, 26,389 మంది వికలాంగులు ఉన్నారు. బెడ్‌రీడెన్ బాధితులను ఇంటికే వెళ్లి పరీక్షించగా ప్రస్తుతం వికలాంగులకు మదనపల్లె, కడప, రాయచోటి, పీలేరు, రాజంపేట ఆసుపత్రిలలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇందులో జిల్లాలోని మాసినక వికలాంగులు అందరినీ కడపకు, కంటిచూపు, ఎముకలకు సంబంధించిన బాధితులను మదనపల్లె జిల్లా ఆసుపత్రిలో పరీక్షిస్తున్నారు. ఇలా జిల్లాలోని 26,389 మందిని ఈ నాలుగు ఆసుపత్రులలో, ఒక్కో ఆసుపత్రిలో రోజుకు 50 మందికి తక్కువ లేకుండా సంబంధిత వైద్యులు పరీక్షిస్తున్నారు. ఇందులో మానసిక బాధితులు కడపకు, కంటి చూపు, ఎముకలకు సంబంధించిన వారిని మదనపల్లెకు పంపుతు



పేర్లు నమోదు చేసుకుంటున్న బాధితులు

న్నారు. అదే ఇక్కడ సమస్యగా ఉంది. వీరంతా జిల్లాలో ఎక్కడున్నా అటు కడప, ఇటు మదనపల్లెకు రావాల్సి వస్తోంది. వృద్ధులు, పైగా వికలాంగులు కావడంతో దూరాభారం పెద్ద సమస్యగా మారింది. ఎక్కడో ఉన్న రాజంపేట, రైల్వేకోడూరు బాధితులు మదనపల్లెకు వ్యయ ప్రయాసాలకోర్చి రావాల్సి వస్తోంది. ప్రజా రవాణాతో కాకుండా ప్రత్యేకంగా కారు, ఇతర వాహనాన్ని ఏర్పాటు చేసుకుని సహాయకులతో వెళ్లాల్సి వస్తోంది. ఇందు కోసం రూ.6 వేల నుంచి రూ.8 వేలు ఖర్చు అవుతోందని బాధితులు వాపోతున్నారు. పైగా ఆసుపత్రులలో నిరీక్షణతో ఇబ్బందులు పడుతున్నారు.

వికలాంగుల్లో వివిధ సమస్య ఉన్న బాధితులను గుర్తించి వరుసగా వార్డు, గ్రామ సచివాలయాల నుంచి నోటీసులు పంపుతున్నారు. పరీక్షకు హాజరు కావాల్సిన తేదీ, సమయం, ఆసుపత్రి పేరుతో జారీ చేస్తున్నారు. ఇలా ఇప్పటికే రెండునెలలుగా ఈ ప్రక్రియ జరుగుతుండగా వీరి అర్హత పరీక్ష పూర్తయ్యేందుకు మరోరెండు నెలలు సమయం పడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. పింఛన్ లబ్ధిదారుడు రేషన్‌కార్డు, ఆధార్‌తో పాటు గతంలో వికలత్వాన్ని ధ్రువీకరిస్తూ సంబంధిత వైద్యుడు జారీ చేసిన సదరం సర్టిఫికెట్‌ను తీసుకెళ్లి అర్హతను నిరూపించుకుంటున్నారు. ఇక్కడ వైద్యులు మరోసారి పరీక్షించి రిమార్క్ నమోదు చేస్తున్నారు. అయితే గతంలో ఇచ్చిన వికలత్వశాతం పింఛన్‌కు సరిపోతుందా? తగ్గిందా? ఎక్కువగా ఉందా అనే అంశాన్ని లబ్ధిదారునికి చెప్పకపోయినా వైద్యులు ప్రభుత్వానికి నివేదించనున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో అనర్హులకు కూడా పింఛన్ మంజూరు చేయడంతో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం అనర్హులు, బోగస్ పింఛన్లను ఏరివేసే క్రమంలో రీవెరిఫికేషన్ చేస్తోంది. అర్హులకు మాత్రమే ప్రభుత్వ పథకాలు అందాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఇప్పటికే రూ.15 వేలు అందుకుంటున్న పింఛన్ దారులపై విచారణ పూర్తయినా ఎవరికీ పింఛన్ ఆపలేదు. కొత్త వారికి పింఛన్లు మంజూరు చేసే క్రమంలో పాతవారి అర్హత తేల్చిన తర్వాతే ముందుకెళ్లనున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.



వృద్ధుడిని పరీక్షకు మొదటి అంతస్థుకు తీసుకెళ్తున్న సహాయకుడు



వైద్యుడి గది వద్ద క్యూలో..

కోదండరామాలయంలో ఘనంగా ఉగాది వేడుకలు



కోదండరాముడికి పూజలు చేస్తున్న అర్చకులు

ఒంటిమిట్ట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : కోదండ రామాలయంలో ఆదివారం ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. వేకువజామునే ఆలయ అర్చకులు పవన్ కుమార్, శ్రావణ్‌కుమార్‌లు స్వామివారికి అభిషేకం చేసి అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి సీతారామ లక్ష్మణులను దర్శించుకున్నారు. ఉదయం 9 గంటలకు ఆస్థాన పురోహితులు ఏలేశ్వరం గురుస్వామి పంచాంగ శ్రవణం చేశారు. సాయంత్రం సీతారామ లక్ష్మణ ఉత్సవ మూర్తులను పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.



ఊరేగింపులో కోదండరాముడు

ఉగాది రోజున విషాదం..

- ఈతకు వెళ్లి విద్యార్థి మృతి



ఈతకు వెళ్లి మృతి చెందిన విద్యార్థి రాఘవ

వాల్మీకిపురం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగ రోజున వాల్మీకిపురం మండలంలో విషాదం చోటు చేసుకుంది. ఈతకు వెళ్లి పదో తరగతి విద్యార్థి మృతి చెందాడు. మండలంలోని నాగంవారిపల్లెకు చెందిన విద్యార్థి రాఘవ (15) స్థానిక వీసీసీ ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతూ పరీక్షలు రాస్తున్నాడు. ఆదివారం ఉదయం తన స్నేహితులతో కలిసి గ్రామ సమీపంలోని విఠలం చెరువు వద్ద ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో బురద ఎక్కువగా ఉండటం అందులో ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. రాఘవ తల్లిదండ్రులు గతంలోనే మృతి చెందారు. రాఘవ మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తల్లిదండ్రులు చనిపోయిన తర్వాత రాఘవ తన చిన్నాన్న, చిన్నమ్మ సంరక్షణలో ఉంటూ చదువుకుంటున్నాడు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగ సందర్భంగా ఈనెల 31న సోమవారం జరగాల్సి ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించి దూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రమైన రాయచోటికి రావద్దని తెలిపారు.

నేడే రంజాన్

- నమాజు కోసం ముస్తాబైన ఈద్గాలు



పీలేరులోని ఈద్గాలో చలువ పందిళ్లు

పీలేరు/కురబలకోట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కఠిన ఉపవాసాలతో 30 రోజులు గడిపిన ముస్లింలు రంజాన్ మాసం ముగింపు సంకేతంగా సోమవారం ఈతుల్ ఫిత్ర్ (రంజాన్) పండుగ జరుపుకోనున్నారు. గల్ఫ్ దేశాల్లో ఆదివారం పండుగ పూర్తవడంతో మన దేశంలో సోమవారం జరుపుకుంటున్నారు. 30 రోజుల ఉపవాసాలు, దానధర్మాలు, తరావీహ్ నమాజులు, జకాత్, ఫిత్రా దానాలతో గడిపిన ముస్లింలు రంజాన్ పండుగ సందర్భంగా తమ గ్రామ ఈద్గాల లో సామూహిక ప్రార్థనలు చేయనున్నారు. ఈద్గాల కమిటీ సభ్యులు చలువ పందిళ్లు వేసి సుందరంగా అలంకరించారు. పీలేరులోని ఈద్గాను పీలేరు అర్బన్ సీఐ యుగంధర్, ఎస్ఐ బాలకృష్ణ, పలువురు ముతవల్లీలు సందర్శించి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పండుగ నమాజు గురువారం ఉదయం 8.30 గంటలకు ప్రారంభమవుతుందని, ఆ సమయానికి ప్రజలందరూ ఈద్గాకు చేరుకోవాలని, స్థానిక జెండామాను నుంచి జమాత్ ఉదయం 7.45 గంటలకు బయలుదేరుతుందని వారు తెలిపారు. పీలేరుతో పాటు జిల్లాలోని మదనపల్లె, కురబలకోట, ములకలచెరువు, రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరుతో పాటు ఇతర ప్రాంతాల్లో రంజాన్ నమాజ్ కోసం ఈద్గాలు సిద్ధమయ్యాయి.

అమ్మవారికి ముస్లింల పుట్టింటి సారె

- దేవుని కడపలో వైభవంగా ఉగాది వేడుకలు



దేవుని కడప ఆలయంలో టెంకాయలు కొడుతున్న ముస్లింలు



ఆలయంలోకి వస్తున్న ముస్లిం మహిళలు



స్వామి వారి పాదాలకు పూలు వేసి నమస్కరిస్తున్న ముస్లిం మహిళ



దర్శనానికి క్యూలో వెళుతున్న ముస్లిం మహిళలు

కడప కల్చరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగను ఆదివారం జిల్లా ప్రజలు అత్యంత ఆనందకరంగా జరుపుకున్నారు. పలు ఆలయాలలో వేదోక్తంగా పంచాంగ శ్రవణం చేసి ఉగాది పచ్చడి పంచి పెట్టారు. దేవుని కడప శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల సందడి కనిపించింది. తిరుమలేశుని దివ్యరూప దర్శనం కన్నులారా తిలకించేందుకు పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి చేరుకోవడంతో సందడి నెలకొంది. ఆనవాయితీగా ముస్లిం మహిళలు బీబీ నాంచారమ్మ అమ్మవారికి పుట్టింటి సారెను తీసుకొచ్చారు. ఆలయానికి పలువురు ముస్లిం మహిళలు చేరుకుని క్యూలో నిల్చుని వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న అనంతరం అమ్మవారికి పుట్టింటి సారె సమర్పించారు.

సంద్రకొండకు నిప్పు...

62 గొర్రెలు అగ్నికి ఆహుతి





సజీవ దహనమైన గొర్రెలు, బాధితుడిని విచారిస్తున్న ఎస్ఐ నరసింహుడు

ములకలచెరువు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఆకతాయిలు చేసిన పనికి మూగ జీవాలు సజీవ దహనమయ్యాయి. సంద్రకొండకు నిప్పు పెట్టడంతో ఆదివారం 62 గొర్రెలు మంటల బారినపడి అగ్నికి ఆహుతయ్యాయి. దీంతో రూ.7 లక్షల వరకు నష్టం వాటిల్లింది. ఈ ఘటనలో గొర్రెల కాపరి మంటల బారి నుంచి బయటపడ్డాడు. ఉగాది పండుగ రోజు చోటు చేసుకున్న సంఘటన విషాదం నింపింది. బాధితుడి కథనం మేరకు... ములకలచెరువు మండలం పర్తికోట పంచాయతీ వసంతరాయనిపల్లెకు చెందిన పూజారి శ్రీరాములు గొర్రెలు మేపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రోజూ లాగే తనకున్న 122 గొర్రెలను మేపుకొచ్చేందుకు సమీపంలో ఉన్న సంద్రకొండకు వెళ్లాడు. అక్కడ గొర్రెలు మేస్తుండగా 11 గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు సంద్రకొండకు నిప్పు పెట్టారు. ఎండిపోయిన బోద అధికంగా ఉండడంతో మంటలు వేగంగా వ్యాప్తి చెంది గొర్రెలు మేస్తున్న చోటికి చేరి పెద్ద ఎత్తున ఎగిసిపడ్డాయి. దీంతో కాపరి గొర్రెలను కొండ కిందకు తోలుకొచ్చేందుకు యత్నించాడు. పొగ, మంటలు భారీగా ఎగిసిపడడంతో గొర్రెలు అందులో చిక్కుకుని 62 గొర్రెలు మంటల బారిన పడి సజీవ దహనమయ్యాయి. మిగిలిన 60 గొర్రెలను కొండ కిందికి తోలుకొచ్చాడు. వీటిలో కూడా పలు గొర్రెలు గాయపడగా అతను అదృష్టవశాత్తు తప్పించుకున్నాడు. పశువైద్యాధికారిణి నివేదిత, ఎస్ఐ నరసింహుడు సంఘటనా స్థలానికి చేరుకుని సజీవదహనమైన గొర్రెలను పరిశీలించారు. సంఘటన గురించి బాధితుడిని అడిగి తెలుసుకున్నారు. మాజీ వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, టీడీపీ నాయకులు కేశవరెడ్డి, ఎర్రంరెడ్డి, చిన్నపరెడ్డి తదితరులు బాధితుడిన్ని పరామర్శించి ఓదార్చారు. బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరారు.

ప్రజలంతా సుఖసంతోషాలతో గడపాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), మార్చి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలందరూ శ్రీవిశ్వావసు నామ సంవత్సరంలో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆకాంక్షించారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని సుధా ఫంక్షన్ హాల్‌లో కలెక్టర్ అధ్యక్షతన ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వర్షాలు సమృద్ధిగా కురిసి పల్లెలు పంటలతో కళకళలాడాలని ఆకాక్షించారు. ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు మాట్లాడుతూ ఉగాది పండుగ తెలుగు వారికి ఎంతో ప్రత్యేకమని, తెలుగు నూతన సంవత్సరంలో ప్రజలందరూ ఆనందంగా, ఆరోగ్యంగా, సురక్షితంగా జీవించాలని కోరుకుంటున్నానని తెలిపారు. వీరభద్రస్వామి ఆలయ అర్చకులు రాచయగీశ్‌స్వామి పంచాంగ శ్రవణం చేశారు. కార్యక్రమంలో కార్యక్రమంలో మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్, డీఆర్వో మధుసూదన్‌రావు, దేవదాయ జిల్లా అధికారి విశ్వనాథ్, పర్యాటకశాఖ జిల్లా అధికారి నాగభూషణం, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. తెలుగు భాష గొప్పతనాన్ని తెలియజేసి తెలుగు సంస్కృతిని చాటి చెబుతూ విద్యార్థినులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు సభికులందరినీ అలరించాయి.

నలుగురికి ఉగాది పురస్కారాలు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది సనాతన ధర్మానికి విశేష సేవలు చేసిన వేదపండితులకు అందించే ఉగాది పురస్కారాల్లో భాగంగా ఈ సంవత్సరం ఉగాది రోజున జిల్లాకు చెందిన నలుగురికి రూ.10,016 నగదు, ప్రశంసాపత్రాలు అందజేశారు. పురస్కారాలు అందుకున్న వారిలో టి.సదాశివప్ప (పీటీఎం), ఎ.నారాయణ మూర్తి (కలికిరి), ఎ.పార్థసారధి భట్టర్ (రామసముద్రం), ఎస్.వాసుదేవశర్మ (వై.కోట, రైల్వేకోడూరు) ఉన్నారు.

ఆదర్శ రైతులను సన్మానించిన కలెక్టర్

జిల్లాకు చెందిన నలుగురు ఆదర్శ రైతులకు కలెక్టర్ ఉగాది పురస్కారాలు అందచేసి ఘనంగా సన్మానించారు. ధర్మారెడ్డి, రెడ్డిగఫార్, పెంచలయ్యనాయుడు, జనార్ధన్‌రెడ్డిల సేవలను గుర్తిస్తూ పురస్కారాలు అందచేశారు.



ఉగాది వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్ శ్రీధర్, తదితరులు,



ఉగాది పురస్కారాలు అందుకున్న ఆదర్శ రైతులు

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రి



ఎక్స్‌రే యంత్రం

● రైల్వేకోడూరు ఆస్పత్రికి అధునాతన పరికరాలు ● త్వరలో రోగులకు అందుబాటులోకి..

రైల్వేకోడూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిని ప్రైవేటు ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వం సిద్ధం చేస్తోంది. రైల్వేకోడూరు ప్రభుత్వ పాత ఆస్పత్రి అలానే ఉంచిన ప్రభుత్వం ఏడాది క్రితం సుమారు రూ. 12 కోట్లతో 50 పడకల ఆస్పత్రి నిర్మించింది. ఇందులో మొదట రక్త పరీక్షలు చేసే పరికరాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వైద్యవిధానపరిషత్ వారు పుల్లీ ఆగో అనలైజర్ (వివిధ రకాల పరీక్షలు చేసే యంత్రం) పంపారు. ఇందుకోసం ఒక కంప్యూటర్‌తో పాటు వాటర్ ఫిల్టర్స్ పంపారు. వీటిని ల్యాబ్‌లో అమర్చారు. టెక్నీషియన్ వచ్చి ఇన్‌స్టాల్ చేయాల్సి ఉంది. ఈ పరికరంతో 300 రకాల పరీక్షలు చేయవచ్చు. కిడ్నీ పరీక్షలు చేసే విధంగా అధునాతన యంత్రం అందుబాటులోకి వస్తోంది. ఎక్స్‌రే మిషన్ వచ్చింది. దీని సీఆమ్ అనే పరికరం రావాల్సి ఉంది. కొన్ని రోజుల్లో ఇవి రోగులకు అందుబాటులోకి రానున్నాయి. కొత్తగా ఏర్పాటు చేసిన ఆస్పత్రిలో శవపరీక్ష గది కూడా ఏర్పాటు చేశారు. క్యాంటీన్, సెక్యూరిటీ తదితరాలు నిర్మించారు. ఆస్పత్రికి రోజుకు 300 మందికి పైగా రోగులు వస్తుంటారు. అన్నిరకాల మందులు రోగులకు అందుబాటులో ఉన్నాయి. కుక్క, పాము కాటుకు కూడా మందులు రోగులకు అందుబాటులో ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు. గుండె పోటుకు గురైన వారిని కాపాడడానికి రూ. 40 వేలు విలువ చేసే ఇంజక్షన్ ఆస్పత్రిలో సిద్ధంగా ఉంటుందని వైద్యులు తెలిపారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో వేలకువేలు పోగొట్టుకోకుండా, ప్రజలు ప్రభుత్వ ఆస్పత్రిలో ని సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు అంటున్నారు.


రైల్వేకోడూరు ఆస్పత్రికి చేరిన అధునాతన యంత్రం

ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్యం



ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్యం రోగులకు అందుతోంది. అన్ని రకాల మందులు ఉన్నాయి. ఎక్కడ లోపాలు లేకుండా చేస్తున్నాం. ఎక్కడ సమస్యలు లేకుండా చేస్తున్నాం. గుండె పోటుకు గురైన వారికి అత్యవసరంగా ప్రాణాలను కాపాడానికి రూ.40 వేలు విలువ చేసే ఇంజక్షన్ ఉచితంగా వేస్తాం.

- బ్రహ్మకుమారి, ప్రధాన వైద్యురాలు

అనేక జబ్బులు గుర్తించవచ్చు



అధునాతన పరికరాలతో అనేక జబ్బులను గుర్తించ వచ్చు. ఇప్పటికే అనేక కొత్త పరికరాలు వచ్చాయి. వీటిని త్వరలో అందుబాటులోకి తీసుకుని వస్తాము. ప్రైవేటు ఆస్పత్రిలో వేలకు వేలు ఖర్చయ్యే పరీక్షలు, ఇక్కడ ఉచితంగా చేస్తున్నాం. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

- అబ్దుల్ రషీద్, ల్యాబ్ టెక్నీషియన్

సంస్కృతి సంప్రదాయాలే మన వారసత్వ సంపద

కడప ఎడ్యుకేషన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): భారతదేశం సంస్కృతి సంప్రదాయాలకు నిలయమని, అదే మన నిజమైన వారసత్వ సంపదని తిరుమల - తిరుపతి దేవస్థానాల వైదిక యూనివర్సిటీ డీన్ డాక్టర్ రాజేష్‌భట్టర్ అన్నారు. ఆదివారం కడప నగరం మానస సమావేశ మందిరంలో భారత జాతీయ కళా సంస్కృతి వారసత్వ పరిరక్షణ సంస్థ (ఇంటెక్) ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు విజయ్ భట్టర్ పంచాంగ పఠనం చేశారు. ఇంటాక్ జాతీయ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు లయన్ కె.చిన్నపరెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్షుడు ఎ. వెంకటసుబ్బయ్య, పూర్వ అధ్యక్షుడు డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి, పోతుల వెంకటరామిరెడ్డి తో పాటు ఆ సంస్థల సభ్యులు వేద పండితులను ఘనంగా సత్కరించారు. అనం తరం సంస్థ పురోభివృద్ధిలో తోడ్పాటునంది స్తున్న సభ్యులందరినీ పోతుల ట్రస్టు ఆధ్వ ర్యంలో ఘనంగా సత్కరించారు. జ్ఞాపిక లను అందజేశారు.

అంకాలమ్మ ఆలయానికి వెండి ముఖ కవచాలు అందజేత

పులివెందుల , మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ఉగాది సందర్భంగా స్థానిక అంకాలమ్మ ఆలయం లోని అమ్మవార్లకు పల్లె వెంకట అశోక్‌కుమార్‌రెడ్డి కుటుంబ సభ్యులు, మిట్ట మల్లికార్జునశెట్టి కుటుంబ సభ్యులు మిట్ట కరుణాకర్, మిట్ట మంజునాథ్, గండి దేవస్థాన ఏఈ నిఖిల్ కుటుంబ సభ్యులు సంయుక్తంగా మూడు కిలోల వెండి కవచాలను సమర్పించారు. ఆలయ ఛైర్మన్ నాగేంద్ర ప్రసాద్, ఈవో కేవీ రమణలకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు సురేశ్ దాతలతో కలిసి మంగళ వాయిద్యాల నడుమ ఆలయం చుట్టూ అమ్మవారి వెండి కవచాలతో ప్రదక్షిణలు చేశారు. అనంతరం అమ్మవార్లకు అలంకరిం చారు. ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు.


వెండి కవచాలతో ప్రదక్షిణ చేస్తున్న దాతలు

రాయచోటి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తనిఖీ

రాయచోటిటౌన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ప ట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఆ దివారం అనంతపురం జిల్లా రిజిస్ట్రార్ అన్నమ య్య జిల్లా ఇన్‌చార్జి రిజిస్ట్రార్ శ్రీనివాసులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. భూములు, స్థలాలు రిజిస్టర్ చేసే ముందు ఒకటికి రెండు సార్లు పరిశీలించి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు లేకుండా చూసుకోవాలన్నారు. రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు.


రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసులు

ముంబై ఐఐటీలో తెలుగుతేజం

రాయచోటిటౌన్, మార్చి30(ఆంధ్రజ్యోతి): ముంబై గడ్డ తెలుగోడి అడ్డా అని నిరూపించాడు మురికినాటి సాయిదివ్యతేజరెడ్డి. రాయచోటి పట్టణ పరిధిలోని చెన్నముక్కపల్లెకు చెందిన మురికినాటి శ్రీనివాసులరెడ్డి కుమారుడు సాయిదివ్యతేజరెడ్డి ముంబై ఐఐటీలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఆ విద్యాసంస్థలో జరిగిన యూజీ సోషల్ సెక్రటరీ ఎన్నికల్లో ఘనవిజయం సాధించి తెలుగువారి సత్తా చాటాడు. ఐఐటీ బొంబాయి చరిత్రలో మొట్టమొదటి సారిగా ఒక తెలుగువాడు ఎన్నిక కావడం గర్వకారణం. ఇంతటి ఘనవిజయాన్ని సాధించిన సాయిదివ్యతేజరెడ్డికి ప్రముఖుల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.


సాయి దివ్యతేజరెడ్డి

మామిడి తోటకు నిప్పు

గాలివీడు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): అకతాయిలు నిప్పు పెట్టడంతో మామిడి చెట్లు, డ్రిప్పు పైపులు దగ్ధమయ్యాయి. గోపనపల్లె పంచాయతీ సిద్దవాండ్లపల్లె నివాసి వెంకట్రమణకు చెందిన 8 ఎకరాల మామిడి తోటకు ఆదివారం ఆకతాయిలు నిప్పంటించారు. దీంతో 30 మామిడి , 5 కొబ్బరి చెట్లు , 10 నేరేడు చెట్లతో పాటు 5 పైపులు, 50 మీటర్ల మోటారు వైరు , స్టార్టర్, 10 మీటర్ల కేబుల్ వైరు కాలిపోయాయని బాధితుడు తెలిపాడు. సమాచారం అందుకుని తాము వెళ్లేలోగా ఇవన్నీ కాలిపోగా, మిగిలినవాటిని కాపాడుకున్నామని తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఏదైనా సహాయం చేయాలని వారు కోరారు.


కాలిపోయిన మామిడి చెట్లు

చికిత్స పొందుతూ మహిళ మృతి

కడప క్రైం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కడప నగరం అక్కాయపల్లెలో నివాసం ఉంటున్న ఓ మహిళ కడప రిమ్స్‌లో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందినట్లు తాలుకా సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. కర్నూలు జిల్లా దేవనకొండ మండలం బండపల్లికి చెందిన వడ్డె లక్ష్మీదేవి (32) భర్త రాముడు ఒకటిన్నర సంవత్సరం క్రితం జీవనోపాధి కోసం కడపకు వచ్చారు. అక్కాయపల్లెలో ఇల్లు అద్దెకు తీసుకుని పనులకు వెళుతుండేవారు. ఏడాది క్రితం నుండి ఆమె కడుపు నొప్పితో బాధపడుతుండేదని, శనివారం రాత్రి కడుపునొప్పి రావడంతో భర్త ట్యాబ్లెట్ల కోసం బయటికి వెళ్లాడు. ఆ సమయంలో ఆమె తలకు పూసుకునే రంగు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. తిరిగి వచ్చిన భర్త ఇది గమనించి రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

తాటివనంలో అగ్నిప్రమాదం

కమలాపురం రూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఆకతాయిలు నిప్పం టించడంతో ఆదివారం రాత్రి మం డలంలోని రామచంద్రపురం సమీ ప ఫారెస్టు ఏరియా తాటివనంలో మంటలు ఎగసిపడుతున్నాయి స్థా నికులు ఫైర్‌స్టేషనుకు సమాచారం ఇవ్వగా ఫైర్‌ఇంజను అందుబాటు లో లేనట్లు తెలిసింది.


తాటివనంలో ఎగసిపడుతున్న మంటలు

బస్సు ఢీకొనడంతో ఒకరికి గాయాలు

సిద్దవటం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనాన్ని బస్సు ఢీకొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు ప్రదీప్ కుమార్ రెడ్డి అనే వ్యక్తి ఆదివారం సాయంత్రం మండల కేంద్రంనుంచి చంటిగారిపల్లెకు బైక్‌పై వెళుతుండగా ప్రధాన రహదారి మలుపు వద్ద కడప నుంచి బద్వేలు వైపు వెళుతున్న ఆర్టీసీ హైర్డ్ బస్సు ఢీకొంది. దీంతో తలకు, ఎడమకాలుకు బలమైన గాయాలు తగిలిన అతనిని 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఇద్దరు సీఎంలున్నా నీటి సమస్య పట్టించుకోలేదు

● ఏప్రిల్ 15 నాటికి పరిష్కారం

● వేంపల్లెలో బోర్లను ప్రారంభించిన బీటెక్ రవి

వేంపల్లె, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): పులివెందుల ప్రాంతంలో ఇద్దరు ముఖ్యమంత్రులు పని చేశారని, పాడా పథకం కింద వేల కోట్లు ఖర్చు చేశారని, అయినా పులివెందుల నియోజకవర్గంలో తాగునీటి సమస్య తీరలేదని పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి తెలిపారు. వేంపల్లెలోని రాజీవ్‌నగర్ కాలనీ, పులివెందుల రోడ్డులోని శ్లోకస్కూల్ సమీపంలో ఏర్పాటు చేసిన బోర్లను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేంపల్లెలో తాగు నీటి సమస్య పరిష్కారానికి ఎక్కడ అవసరమైతే అక్కడ బోర్లు వేయాలని స్థానిక అధికారులకు, నాయకులకు సూచించారు. గతంలో ముఖ్యమంత్రులుగా పని చేసి వైఎస్ జగన్, ఆయన తండ్రి ప్రజల సమస్యలు, ముఖ్యంగా తాగునీటి సమస్య పరిష్కారంపై దృష్టి పెట్టలేదన్నారు. జల్ జీవన్ కింద ఏప్రిల్ 15 నాటికి చక్రాయపేట మండలం మినహా మిగిలిన మండలాల్లో తాగునీటి సమస్యకు పరిష్కారం చూపుతామన్నారు. మండల పరిశీలకుడు రఘునాథరెడ్డి,మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్, మండల కన్వీనర్ మునిరెడ్డి, యువ నాయకులు నామా వేమకుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు రామగంగిరెడ్డి, మైనార్టీ నాయకులు షరీఫ్, తెలంగాణ వలి, మడక శ్రీనివాసులు, ఎద్దుల శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


తాగునీటి బోరును ప్రారంభిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి, టీడీపీ నాయకులు

మూడేళ్లలో హత్య కేసు పరిష్కారం

● రాచమల్లు రాజీనామా చేస్తాడా ?

వేంపలె : ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు రెండు మూడేళ్లలో కోర్టు తేల్చే అవకాశం ఉందని పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి తెలిపారు. వేంపల్లెలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వివేకా హత్య కేసులో అవినాశ్‌రెడ్డి ప్రమేయం ఉందని తెలిస్తే ఎమ్మెల్యేలమంతా మూకుమ్మడిగా రాజీనామా చేస్తామని గతంలో ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి చెప్పాడని గుర్తు చేశారు. కేసులో ప్రమేయం ఉన్నట్లు అవినాశ్‌రెడ్డిపై కేసు నమోదైనా రాజీనామా చేయలేదని, కేసు నిరూపితమై జైలుశిక్ష పడితే రాజీనామా చేస్తానని శివప్రసాద్ చెప్పినపుడు అభ్యంతరం చెప్పి, అపుడు మీరు ఎక్కడుంటారో ఎవరికి తెలుసునని, కేసు నమోదైతే రాజీనామా చేస్తావా? అని ప్రశ్నించానని బీటెక్ రవి అన్నారు. సునీల్‌యాదవ్ ఇటీవల ఇచ్చిన స్టేట్‌మెంట్‌లో వాస్తవం ఉన్నట్లుందన్నారు. అందరి పాత్రలు ఆ సినిమాలో లేవని ఆయన చెప్పారని, కొన్ని పాత్రలనే పెట్టడం, మిగతావారి ప్రమేయం లేదంటూ సునీల్‌యాదవ్ చెప్పింది వాస్తవమేనన్నారు. హత్య కేసుకు సంబంధించి ఇటీవల జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో కేసు త్వరగా తేలుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

ఓటమితో రాచమల్లుకు మతి పోయింది

ప్రొద్దుటూరు , మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ఓటమిని జీర్ణించుకోలేక మతి చెడిపోవడంతోనే వైసీపీ నాయకుడు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి ఎమ్మెల్యే వరద రాజులరెడ్డిపై అవాకులు చవాకులు మాట్లాడుతున్నాడని టీడీపీ నాయకుడు రిటైర్డ్ సబ్ ఇన్‌స్పెక్టర్ శంకర్ ఆరోపించారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గోపవరం ఉపసర్పంచ్ ఎన్నికల కోసం వరదరాజులరెడ్డి రభస చేశాడని మాట్లాడుతున్నావు. గతంలో నీ పార్టీలో ఉన్న శివచంద్రారెడ్డి కొడుకు మత్స్య కాలనీకి వార్డు మెంబరుగా పోటీ చేస్తే నీవెందుకు పోటీ నిలబెట్టి కోట్లు ఖర్చు పెట్టి ఓటమి పాలయ్యావని ప్రశ్నించారు. ఎమ్మెల్యేగా ఉండి కేవలం ఒక వార్డు మెంబరుకు పోటీ ఎందుకు పెట్టించి ఓడిపోయావన్నారు. బీసీలకు ఉప సర్పంచ్ పదవి ఇస్తానని చెప్పి మోసం చేశావు కాబట్టి బీసీలకు న్యాయం చేయడం కోసం వరదరాజులరెడ్డి గోపవరం ఉపసర్పంచు ఎన్నికల్లో జోక్యం చేసుకున్నాడన్నారు. టీడీపీ బీసీ నాయకుడు పగిడాల దస్తగిరి మాట్లాడుతూ రాచమల్లు ప్రసాద్ రెడ్డి వార్డు మెంబర్లకు రూ.10 లక్షలు డబ్బు, మూడు సెంట్ల స్థలం ఇస్తానని చెప్పి మాట తప్పాడన్నారు. ఓట్లేసి రండి.. డబ్బులు ఇస్తానని చెప్పి.. ఆయన బంధువైన ఎన్నికల అధికారి రామాంజనేయుల రెడ్డికి చెప్పి వాయిదా వేయించాడన్నారు. పెద్దాయనతో పోరాడే ముందు తమతో ఢీకొనాలని సవాల్ విసిరారు. ప్రాణ భయంతోనే నేటికీ ఇంటి చుట్టూ కరెంట్ పెట్టుకున్నాడని విమర్శిం చారు. నాడు ప్రవీణ్ రెడ్డిపై దాడి చేసి.. అతే మంచి వాడంటాడ న్నారు. లింగారెడ్డిని అవమానించిన ఆయన నేడు లింగారెడ్డిని పొగుడుతున్నాడ న్నారు. ఆయన జిత్తుల మారి వైఖరిని ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. సమావేశంలో మాజీ కౌన్సిలర్ తలారి పుల్లయ్య, రామకృష్ణ , కేశవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రిటైర్డ్ ఎస్ఐ శంకర్, పగిడాల దస్తగిరి

మత సామరస్యానికి ప్రతీక కడప జిల్లా

● ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్

కడప క్రైం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): హిందూ, ముస్లింలు కడప జిల్లాను మత సామరస్యానికి ప్రతీకగా నిలిపారని ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ తెలిపారు. రంజాన్‌ను పురస్కరించుకుని స్థానిక ఉమేశ్‌చంద్ర స్మారక కల్యాణ మండపంలో ఆదివారం సాయంత్రం జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో పోలీసుశాఖలోని ముస్లిం పోలీసు అధికారులు, సిబ్బందికి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ ఇఫ్తార్ విందును స్వీకరించారు. అమీన్‌పీర్ దర్గా ఇమాం ఇనయతుల్లా ప్రార్థన చేయించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఇఫ్తార్ విందు మత సామరస్యాన్ని చాటిందని, ఈ విందులో నగరంలోని ముస్లింలు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారన్నారు. తాను గతంలో కడప డీఎస్పీగా ఉన్నప్పుడు వినాయక చవితి, బక్రీదు, ఉగాది, రంజాన్ పండుగల సమయంలో హిందూ ముస్లింలు అందించిన సహకారం మరువలేనిదన్నారు. ఉగాది సందర్భంగా దేవునికడప ఆలయంలో ముస్లింలు పూజలు నిర్వహించడం, అమీన్‌పీర్ దర్గాను హిందువులు దర్శించుకోవడం మతసామరస్యానికి నిదర్శనమన్నారు. అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ రమణయ్య, నగరంలోని ముస్లిం ప్రముఖులు, వన్‌టౌన్ సీఐ రామకృష్ణ, టూటౌన్ సీఐ నాగార్జున, చిన్నచౌకు సీఐ ఓబులేసు, ఆర్‌ఐలు వీరేశ్, శ్రీశైలరెడ్డి, శివరాముడు, చిన్నచౌకు ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి, టూటౌన్ ఎస్ఐ ఎస్‌కేఎం హుసేఉన్, రిమ్స్ ఎస్ఐ జయరాముడు, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేశ్, పోలీసు సిబ్బంది, నగరంలోని ముస్లిం సోదరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


కడప: ముస్లింలకు భోజనం వడ్డిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్


రాయచోటి: ఉగాది సందర్భంగా సిబ్బందికి భోజనాలు వడ్డిస్తున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు దంపతులు

రాయచోటిలో ఘనంగా ఉగాది సంబరాలు

రాయచోటిటౌన్ : ఆరు రుచుల సమ్మేళనం ఉగాది పచ్చడి అని, జీవితంలో కష్టసుఖాలు, కలిమిలేములకు ఇది ప్రతీక అని, ఈ ఉగాది పండుగ మీ జీవితాల్లో సుఖ సంతోషాలు నింపాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆ కాంక్షించారు. ఆదివారం విశ్వావసు నామ సంవత్సరం ఉగాది వేడుకను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ దంపతులు సంప్రదాయ దుస్తుల్లో వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం పోలీసు అధికారులకు, సిబ్బందికి ఉగా ది పచ్చడి, ప్రసాదం అందజేసి, భోజనాలు వడ్డించారు. అనంతరం పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి గ్రూప్ ఫొటో దిగి అందరిలో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో కొత్త కొత్త ఆశలతో ముందుకు వెళ్లాలని కోరుతూ జిల్లా ప్రజలకు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు, పోలీసు అధికారులకు, పోలీసు సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పూజారి పంచాంగం చదివి వినిపించారు.

ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు

రంజాన్ పండుగను ముస్లింలు సంతృప్తి, సంతోషాలతో జరుపుకోవాలంటూ ఎస్పీ ఆకాంక్షించారు.. రంజాన్ సందర్భంగా సోమవారం సెలవు దినంగా ప్రకటించినందున ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేశామని, ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) ఎం.వెంకటాద్రి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు వీజే రామకృష్ణ, యం. పెద్దయ్య, రాయచోటి అర్బన్ సీఐ జీవీ చలపతి, ట్రాఫిక్ సీఐ ఎస్. విశ్వనాథ రెడ్డి, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది తదితరులు8 పాల్గొన్నారు.

జిల్లావాసులకు ఉగాది పురస్కారాలు

వేంపల్లె, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన పలువురు ప్రముఖులకు ఉగాది పర్వదినం సందర్భంగా ఆదివారం విజయవాడలోని తుమ్మల కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉగాది పురస్కారాలతో సన్మానిం చారు. ఈ సందర్భంగా వేంపల్లె పట్టణానికి చెందిన ప్ర ముఖ కథా రచయిత వేంపల్లె షరీఫ్ ఉగాది పురస్కారం తోపాటు రూ.10వేల నగదు, జ్ఞాపిక అందుకున్నారు.

మైదుకూరు రూరల్ : మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని మామిళ్లపల్లెకు చెందిన రైతు పందిటి కృష్ణమూరి నూతన పద్ధతుల్లో వ్యవసాయం చేస్తూ అధిక దిగుబడి సాధించారు. దీంతో ఆయనకు సీఎం శాలువా కప్పి, జ్ఞాపికతో పాటు రూ. 5 వేల నగదు బహుమతిని అందజేశారు.

బద్వేలు : బద్వేలుకు చెందిన ప్రముఖ సాహితీవేత్త హనుమంతరావుకు ఉగాది పురస్కారం తో పాటు పాటు శాలువ, తెలుగుతల్లి ప్రతిమ, పదివేల రూపాయలు నగదుతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, సాంస్కృతిక శాఖమంత్రి కందుల దుర్గేష్, సహస్రావధాని డాక్టర్ మాడుగులఫణిశర్మ తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో ఉగాది సంబరాలు


డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు

కడప కల్చరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి):ఉగాది సందర్భంగా నగరంలోని శిల్పారామం లో సంప్రదాయ సాంస్కృతిక కళా వేదికపై పరిపాలనాధికారి కృష్ణప్రసాద్ పర్యవేక్షణలో నగర సాయిరాం ఇంగ్లిషు మీడియం స్కూల్ విద్యార్థులు జానపద, సినీ గీతాలకు చేసిన నృత్యాలు కరతాళ ధ్వనులందుకున్నాయి. ఇదిలా వుండగా శిల్పారామం సందర్శించిన వారికి లండన్ బస్సు అందుబాటులో వుంది.

ఓగూరమ్మకు బోనాలు

పెనగలూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఈటమాపురం గ్రామంలోని గుంజనేటి మామిడి తోటలో వెలసిన పట్టపురాయి ఓగూరమ్మ గ్రామదేవతకు ఆదివారం ఉగాది పండుగ సందర్భంగా గ్రామస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు కుంకుమ పూజలో పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఇదే గ్రామం హరిజనవాడలోని గంగమ్మకు పొంగళ్లు నిర్వహించారు. కంబాలకుంట హరిజనవాడలో కొన్ని కుటుంబాల వారు గంగమ్మకు, పొందలూరు హరిజనవాడలో గ్రామదేవత గంగమ్మకు దళితులు పొంగళ్లు సమర్పించారు.


ఈటమాపురం రేణుకా ఎల్లమ్మకు బోనాలు తీసుకువెళుతున్న మహిళలు

ఘనంగా ఉప్పలపాటి గంగమ్మ జాతర

● మొక్కులు చెల్లించుకున్న గ్రామస్తులు

ఓబులవారిపల్లె, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొర్లకుంట గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ఉప్పలపాటి గంగమ్మ, ఓబులవారిపల్లె గ్రామ పంచాయతిలో ఉన్న ఏక వీరమ్మ ఆలయంలో ఘనంగా జాతర నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున మొక్కులు చెల్లించుకున్నారు. జాతరకు హాజరైన భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా కళాకారులు ప్రదర్శించిన చెక్కభజన, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.


గంగమ్మతల్లికి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

ప్రమాదకరంగా చెరువు కట్టలు



పిచ్చిమొక్కలతో నిండిన మల్లెమ్మ చెరువు మొరవ

● దెబ్బతిన్న అలుగులు, మొరవలు ● ఆందోళనలో ఆయకట్టు రైతులు





మల్లెమ్మ చెరువు కట్టపై ఉన్న పుట్టలు... వర్షాలకు తెగిన గుండ్రాజు చెరువు మొరవ

సంబేపల్లె/చిన్నమండెం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): చెరువులపై పాలకులు, అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. గత వైసీపీ పాలనలో చెరువులకు నిధులు విడుదల చేయలేదు. జిల్లా వ్యాప్తంగా చెరువుల కట్టలు కంపచెట్లు, పుట్టలతో అడవులను తలపిస్తున్నాయి. చెట్ల వేర్లు కట్ట భాగంలో చేరి కట్ట బలహీనపడుతోంది. రాయచోటి నియోజకవర్గంలో సంబేపల్లె, చిన్నమండెం, రామాపురం, గాలివీడు, లక్కిరెడ్డిపల్లె మండలాల్లో ఇదే పరిస్థితి కనిపిస్తోంది. సంబేపల్లె మండలంలో 65 చెరువులు, చిన్నమండెం మండలంలో 135 చెరువులు ఉన్నాయి. వర్షాలకు కొన్ని చెరువులు కట్టలు, అలుగులు, మొరవలు దెబ్బతిన్నాయి.

పుట్టలు, కంపచెట్లతో నిండిన మల్లెమ్మ చెరువు

సంబేపల్లె మండలం ప్రకాశ్‌నగర్ కాలనీ పరిధిలోని మల్లెమ్మ చెరువు పుట్టలు, కంపచెట్లతో నిండి ఉంది. మొరవ ప్రాంతం పిచ్చిమొక్కలతో నిండి ఉంది. ఈ చెరువు కింద 80 ఎకరాలు సాగు భూమి ఉంది. కంపచెట్లు పెరగడంతో కట్టబలహీన పడుతోంది.

మొరవ కట్ట తెగిన గుండ్రాజు చెరువు

చిన్నమండెం మండలం వండాడి గ్రామం గుండ్రాజు చెరువు మొరవ కట్ట తెగిపోయి నాలుగేళ్లవుతోంది. ఈ చెరువు కింద తూర్పుపల్లి, కాయలోలపల్లి, తొట్టిలకాడకురవపల్లి, గొర్లముదివేడు వరకు ఉన్న గ్రామాల ఆయకట్టు భూములకు ఈ చెరువు ద్వారా నీరు అందుతుంది. అయితే కాలువ కంపచెట్లు, పిచ్చిమొక్కలతో ఉండడంతో చెరువుకు నీరందే పరిస్థితి లేదు.

గతంలో గాలికి వదిలేశారు



గత వైసీపీ పాలనలో చెరువులను గాలికి వదిలేశారు. గుండ్రాజు చెరువు మొరవను మరమ్మతులు చేయాలని ఎన్నిసార్లు తిరిగినా పట్టించుకోలేదు. గత టీడీపీ ప్రభుత్వంలో చెరువుల మరమ్మతులు క్రమం తప్పకుండా చేసేవారు. వాటి పరిస్థితి ప్రస్తుతం దయనీయ పరిస్థితుల్లో ఉంది. మరమ్మతులు చేసి రైతులకు న్యాయం చేయాలి.

- రమేశ్‌బాబు, మాజీ సర్పంచ్ వండాడి, చిన్నమండెం

ఏడేళ్లుగా పనులు చేపట్టలేదు



చెరువులు, కుంటలు కట్టల పనులు చేసి ఏడేళ్లు అవుతోంది. ఎక్కడ చూసినా పరిస్థితి కంపచెట్లతో నిండి ఉంది. కట్టలు బలహీన పడుతున్నాయి. వర్షాకాలం ముందే కట్టల పనులు చేపట్టాల్సి ఉంది. చెరువులకు గండ్లు పడకుండా ఉండేందుకు మరమ్మతులు అవసరం. ప్రభుత్వం నిధులు కేటాయిస్తే పనులు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నాం.

- శివానాయక్, ఇరిగేషన్ ఏఈ, సంబేపల్లె మండలం

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం



చెరువుల గురించి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. చెరువుల కింద ఉన్న ఆయకట్టు రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నిధులు కేటాయించేలా చూస్తాం. రాబోయే వర్షాకాలం ముందే పనులను చేపట్టి రైతులకు ఉపయోగపడేలా చూస్తాం.

- సుబ్బరాజు యాదవ్, రాజంపేట పార్లమెంట్ టీడీపీ ప్రచార కార్యదర్శి

తాగునీటి సమస్య లేకుండా చూస్తాం



పైపులైన్ పనులు పరిశీలిస్తున్న క్వాలిటీ కంట్రోలర్ డీఈ జాకోపాల్

లక్కిరెడ్డిపల్లె,మార్చి30(ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామంలోనూ తాగునీటి సమస్య తలెత్తకుండా చూస్తామని విజిలెన్స్ అండ్ క్వాలిటీ కంట్రోలర్ డీఈకేసీ జాకోపాల్ పేర్కొన్నారు. ఆదివారం బీ.యర్రగుడి, బురుజుపల్లి, చౌటపల్లి, అనంతపురం గ్రామాల్లో రెండు నెలల క్రితం మంచినీటి పథకం బోర్లు వేసినా వాటికి మోటార్లు అమర్చి పైపులైన్లు ఏర్పాటు చేసి కుళాయి ద్వారా ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తామన్నారు. మంచినీటి పథకం బోర్ల నుంచి పైపులైన్ల ద్వారా అమర్చిన పనులను ఆయన పరిశీలించారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ కిశోర్, సిబ్బంది పాల్గొన్నారు.

గోశాలకు తాగునీటి బోరు ఏర్పాటు

సిద్దవటం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శాఖరాజుపల్లె పంచాయతీ మోహిద్దిన్‌సాహెబ్‌పల్లె గ్రామ సమీపంలో ఉన్న పెనుశిల లక్ష్మీనరసింహస్వామి గోశాల ట్రస్టుకు రూ.2 లక్షల వ్యయంతో మంచినీటి బోరు, మోటారు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గోశాల ట్రస్టు అధినేత వెంకటనరసింహ స్వామి మాట్లాడుతూ శివసాయి ట్రేడర్స్ మాలేపాటి మణికంఠ, పద్మావతి, మెడికల్ స్టోర్ మురారి, గిరీష్, అశోక్, ఇంజనీరింగ్ వెంకటరమణారెడ్డి, రామక్రిష్ణ సేవాసమితి ట్రస్టు సభ్యుల సహకారం అభినందనీయమన్నారు.

లక్కిరెడ్డిపల్లెలో చోరీలను ఆపండి

● పనిచేయని సీసీ కెమెరాలు
● బెంబేలెత్తుతున్న జనం



మూడురోడ్ల కూడలిలో పనిచేయని సీసీ కెమెరాలు

లక్కిరెడ్డిపల్లె, మార్చి30 (ఆంధ్రజ్యోతి): లక్కిరెడ్డిపల్లెలో మూడేళ్లుగా వరస చోరీలు జరుగుతూనే ఉన్నా దొంగల ఆ చూకీ లభించడం లేదు. ఎందుకంటే స్థానిక మూడురోడ్ల కూడలిలో సీసీ కెమారాలు అలంకారప్రాయంగా ఉన్నాయి. అక్కడ ఎనిమిదేళ్ల క్రితం సీసీ కెమారులు అమర్చారు. అవి కనీసం ఏడాది కూడా పనిచేయలేదు. సీసీ కెమెరాలు లేక పోవడంతో ఇక్కడ ఏమి జరిగినా ఎవరికీ తెలియదు. దీంతో వరుస చోరీలు జరుగుతున్నాయి. ఒక్క కార్యాలయంలో కూడా సీసీ కెమారాలు లేవు. దొంగలు దీని ఆసరా చేసుకుని వరస చోరీలకు పాల్పడుతున్నారు. వ్యాపారులు బెంబేలెల్లుతున్నారు. చోరీలు ఎక్కువగా మెడికల్ షాపుల్లో జరిగాయి. 2022 సెప్టెంబరులో దర్బార్‌బాషా మెడికల్‌షాపులో రూ.లక్షా 75 వేలు, మళ్లీ మూడు నెలల తరువాత రూ.60వేలు, మేనెలలో రూ.12000 చోరీ జరిగింది. అదే సంవత్సరంలో డాక్టర్ షఫీనాయక్, ఫరీద్ బాబా మెడికల్ షాపుల్లో చోరీలు జరిగాయి. నెలక్రితం ఆర్టీసీ బస్టాండ్ వద్ద జనరల్ షాపులో చోరీ జరిగింది. స్థానిక మూడురోడ్ల కూడలి, ఆర్టీసీ బస్టాండ్, పోలీసుస్టేషన్‌సమీపాన, రామాపురం, కడప రోడ్డులో సీసీ కెమెరాలు అమర్చాలాని ప్రజలు కోరుతున్నారు.

చిల్లర అంగట్లో నగదు దోచుకెళ్లారు



కూలి పనులకు వెళ్లలేక చిల్లర కొట్టు పెట్టుకొని జీవనం సాగిస్తున్నాం. ఫిబ్రవరి 15వ తేదీన అంగట్లో ఉన్న రూ. 35వేల సరుకులు దోచుకెళ్లారు. త్వరగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. - వెంకటేశ్వరాచారి, బాధితుడు

సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం

లక్కిరెడ్డిపల్లె మూడు రోడ్ల సర్కిల్, మర్రిచెట్టు, రవీంద్రనగర్, కోనంపేట సర్కిళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అనుమతి లభించిన వెంటనే సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం.

- రవీంద్ర, ఎస్ఐ

వింతలు.. విశేషాలు



వందల ఏళ్ల వెంకటేశ్వరస్వామి రాతి విగ్రహం ఇటీవల రైల్వేకోడూరు మండలం శెట్టిగుంట చెరువు కట్ట వద్ద కనిపించింది. విగ్రహం కొంత భాగం దెబ్బతింది. శెట్టిగుంట గ్రామాన్ని ఆనుకుని శేషాచల కొండలు ఉన్నాయి. ఈ కొండల్లో వెంకటేశ్వరస్వామి కొలువుదీరి ఉన్నాడు. ఈ విగ్రహం ఆ కాలం నాటిది అని గ్రామస్థులు భావిస్తున్నారు. పురావస్తుశాఖ అధికారులు పరిశీలిస్తే పూర్తి విషయాలు తెలుస్తాయని పలువురు పేర్కొంటున్నారు.

-రైల్వేకోడూరు, (ఆంధ్రజ్యోతి)

ప్రారంభమైన శ్రీరామనవమి ఉత్సవాలు

రామాపురం, మార్చి30(ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలకంఠ్రావుపేటలో వెలిసిన కోదండ రామాలయంలో తెలుగు సంవత్సరాది ఉగాది మొదలు ఆదివారం సీతా రామ లక్ష్మణ హనుమంత ధ్వజ, నవగ్రహ, మహాగణపతి దేవుళ్లకు ఘనంగా పూజలు నిర్వహించారు. మూలవర్లు ఉత్సవమూర్తులకు షోడశోప్రచార పూజలు, పంచామృతాభిషేకాలు, పట్టువస్త్రాలంకరణ, పూలమాలలు, ఉగాది పచ్చడి ప్రసాద నివేదన మహామంగళహారతి అర్చకులు నిర్వహించారు.

గంగమ్మ అమ్మవారిని దర్శించుకున్న అతికారి

సిద్దవటం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : తెలుగు సంవత్సరాది ఉగాది పండుగ పర్వదినాన మాధవరం-1 పార్వతిపురంలోని శీతల గంగమ్మ అమ్మవారిని రాజంపేట పార్లమెంట్ జనసేన పార్టీ సమన్వయకర్త అతికారి కృష్ణ దర్శించుకున్నారు. కృష్ణ మాట్లాడుతూ ఉగాది పండుగను ప్రతిఒక్కరు ఆనందోత్సాహాలతో జరుపుకోవాలన్నారు.

కష్టసుఖాల కలయికే ఉగాది : డీఈవో

రాయచోటిటౌన్, మార్చి30(ఆంధ్రజ్యోతి): కష్టసుఖాల కలయిక తెలుగు సంవత్సరాది ఉగాది పండుగ అని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ కే. సుబ్రమణ్యం పేర్కొన్నారు. ఆదివారం ఉగాది పండుగ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (అపస్) అన్నమయ్య జిల్లా శాఖ ఆధ్వర్యంలో రాయచోటి పట్టణంలోని కొత్తపేటలో గల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఉగాది పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అపస్ జిల్లా గౌరవాధ్యక్షుడు పరశురాం, ఆంజనేయులు, జిల్లా సహాధ్యక్షుడు నాగేంద్రబాబు, జిల్లా కార్యదర్శి బాలాజీ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి



చర్చి వద్ద నిరసన చేస్తున్న క్రైస్తవులు

రైల్వేకోడూరు రూరల్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ మృతిపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టాలని రైల్వేకోడూరు పట్టణంలోని ఎస్ఏఎల్‌సీ చర్చి సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని టోల్‌గేట్ వద్ద ఉన్న చర్చి ప్రాంగణంలో నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ ఇమ్మానియేల్ బాబు మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ అనుమానాస్పదంగా మృతి చెందడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రవీణ్ మరణంతో క్రైస్తవుల మనోభావాలు దెబ్బతిన్నాయని తెలిపారు. పాస్టర్ మృతిపై ప్రభుత్వం విచారణ నిర్వహించి నిజాలను నిగ్గు తేల్చాలని వారు కోరారు.

అభయాంజనేయస్వామి.. ఆదుకోవయ్యా

రాయచోటిటౌన్, మార్చి30(ఆంధ్రజ్యోతి): 'అభయాంజనేయ స్వామి.. ఆదుకోవయ్యా' అంటూ టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్ బాబు గరుగుపల్లెలో వెలిసిన శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెమ్మాడపల్లె గ్రామ సర్పంచ్ పల్లవు వాసు, తెలుగుదేశం పార్టీ గ్రామ అధ్యక్షుడు ఓర్సు నాగేశ్వర, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట గంగమ్మ జాతరకు అంకురార్పణ



పోతుకు దండ వేసి ఊరేగిస్తున్న జాతర నిర్వాహకులు

రాజంపేట టౌన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కడపజిల్లాలో ప్రఖ్యాతిగాంచిన రాజంపేట గంగమ్మ జాతరకు ఒక ప్రత్యేకత ఉంది. ఈ జాతర చూసేందుకు జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో గంగమ్మతల్లిని దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులు పాల్గొంటారు. గంగమ్మ జాతర అంకురార్పణ సందర్భంగా దున్నపోతును ఆదివారం ఉగాది నాడు జాతర నిర్వాహకులు ఊరేగించారు.ఈ ఊరేగింపులో పెద్దఎత్తున యువత పాల్గొన్నారు.ఆదివారం కావడంతో అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్దఎత్తున భక్తులు పాల్గొనడంతో మరో జాతరను తలపించింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పట్టణ సీఐ రాజా, ఎస్ఐలు లక్ష్మీప్రసాద్‌రెడ్డి, నవీన్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఘట్టి బందోబస్తు నిర్వహించారు. జాతరను మూడో తేది నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఒంటిమిట్ట చెరువు సమస్యకు శాశ్వత పరిష్కారం

ఒంటిమిట్ట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్ట చెరువు సమస్యకు శాశ్వత పరిష్కారం చేయనున్నట్లు రాష్ట్ర మంత్రి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారని రాష్ట్ర కల్లుగీత మాజీ డైరెక్టర్ కొమరా వెంకటనరసయ్య తెలిపారు. ఆదివారం ఉగాది పండుగ సందర్భంగా రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని కలిసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి స్పందించి చెరువుకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని తెలిపారన్నారు.

ఆదర్శ రైతు పురస్కారం అందజేత



పురస్కారం అందుకుంటున్న పెంచలయ్యానాయుడు

ఓబులవారిపల్లె, మార్చి 30 (ఆంధ్రజ్యోతి):బోటుమీద పల్లె పంచాయతీకి చెందిన పెంచలయ్యనాయుడు ఆదర్శ రైతుగా జిల్లా కేంద్రం రాయచోటిలో కలెక్టర్ శ్రీధర్, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు చేతులమీదుగా పురస్కారం అందుకున్నారు.

అనారోగ్యంతో సర్పంచ్ మృతి

సిద్దవటం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : పి.కొత్తపల్లె సర్పంచ్ తుమ్మలూరు అంకయ్య(70) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడని ఆయన కుటుంబ సభ్యులు తెలియజేశారు. మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు జ్యోతి జగదీశ్వర్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు మోహన్‌రెడ్డి శ్రద్ధాంజలి ఘటించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ప్రేమ, క్రమశిక్షణల కలయిక రంజాన్

రాయచోటిటౌన్, మార్చి30(ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసం క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయిక అని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. నెల రోజులు కఠోర వ్రతం పాటించిన వారి శ్రమకు పరిపూర్ణ ప్రతిఫలం లభించే రోజు అని అన్నారు. రంజాన్ మాసంలో వికసించిన ఆధ్యాత్మికత, ప్రేమ, దయ, సామరస్యపు కుసుమాలు ప్రజల జీవితాల్లో గుభాళించాలని ఆయన ఆకాంక్షించారు. ఉపవాసంతో ఆకలి దప్పులతో మనిషిని బాధించడం కాదు పేదవాడి ఆకలి బాధలు తెలుసుకోవడమే ఇస్లాం ఉద్దేశ్యమని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

పోలీసు సేవా పతక గ్రహీతకు సత్కారం

నందలూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పోలీసుసేవా పతకం పొందిన ఎస్ఐ మన్నెం రామ్మోహన్‌ను నాగిరెడ్డిపల్లె శ్రీరామ దేవస్థానం కమిటీ యూత్ అసోసియేషన్‌వారి ద్వారా ఆదివారం ఘనంగా సత్కరించారు. మారమ్మ దేవస్థానం కమిటీ సభ్యులు దుర్గారెడ్డి మాట్లాడుతూ రామ్మోహన్‌ను సత్కరించుకోవడం ఆనందంగా ఉందన్నారు.

వైభవంగా తెలుగు సంవత్సరాది ఉగాది



ఉగాది వేడుకల్లో పాల్గొన్న కళాకారులు

రైల్వేకోడూరు, మార్చి 30(ఆంధ్రజ్యోతి) : ఉగాది పండుగను అన్ని వర్గాల ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. ప్రతి ఇంట్లో ఆరురుచుల ఉగాది పచ్చడి తయారు చేసుకుని ఆరగించారు. పిండివంటలు తయారు చేశారు. బలిజవీధిలో వెలసిన కోదండరామాలయంలో విగ్రహాలను ఊరేగించారు.

సంబేపల్లె: కుటుంబ సభ్యులు అందరూ కొత్త బట్టలను ధరించి షడ్రుచులు ఉగాది పచ్చడి చేసి ఇంటిల్లిపాది ఆరాధించారు. పాడిపంటలు, అష్టైశ్వర్యాలు, సిరిసంపదలతో గడపాలని ప్రార్థించారు.

ఉత్తమ ఆదర్శ రైతుకు సన్మానం

గాలివీడు, మార్చి30(ఆంధ్రజ్యోతి):గాలివీడు మండలం కరణంరెడ్డి గారిపల్లెకు చెందిన గీదర ధర్మారెడ్డి జిల్లా ఉత్తమ ఆదర్శ రైతుగా ఎంపిక కావడంతో ఆదివారం కలెక్టర్ శ్రీధర్ సన్మానించారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

నందలూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : నందలూరుకు చెందిన కవి, గణిత ఉపాధ్యాయుడు అల్లం అశోక్‌కుమార్‌ను కలెక్టర్ శ్రీధర్, ఎస్పీ విద్యాసాగర్ నాయుడు సత్కరించారు. ఎస్టీయూ మండల శాఖ అధ్యక్షుడు షఫివుల్లా, రాష్ట్ర నాయకుడు మోహన్‌రాజు, భరత్‌కుమార్ ఆయన్ను అభినందించారు.

రాజంపేటలో పంచాంగ శ్రవణం

రాజంపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట ఆంజనేయస్వామి దేవాలయంలో తిరుమల- తిరుపతి దేవస్థానం హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో పంచాగ శ్రమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ధర్మాచార్యులు గంగనపల్లి వెంకటరమణ ఉగాది ప్రాసస్త్యాన్ని నిర్వహించారు. ఆలయ ధర్మకర్త పబ్బిశెట్టి సుబ్రమణ్యం ఆధ్వర్యంలో ఆంజనేయస్వామికి ఊంజలసేవ నిర్వహించారు.

ఉత్తమ కళాకారులకు సత్కారం

రాజంపేట మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ఉగాది పండుగ సందర్భంగా రాజంపేట రాయలసీమ కళాపీఠం ఆధ్వర్యంలో గాంధీ మెమోరియల్ క్లబ్ కళామందిరంలో ఆదివారం 27 మంది ఉత్తమ కళాకారులను ఘనంగా సత్కరించారు. రాయలసీమ కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ, కార్యదర్శి వెంకటరమణ, కార్యవర్గ సభ్యుల ఆధ్వర్యంలో పంచాగశ్రవణం నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్యవల్లరి కార్యక్రమాన్ని నిర్వహించారు. కవితా ప్రసంగాలు చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్, జనసేన పార్టీ పార్లమెంటు ఇన్‌చార్జి అతికారి కృష్ణ పాల్గొనగా వారిని సత్కరించారు.



సన్మానం అందుకుంటున్న ధర్మారెడ్డి



అల్లం అశోక్‌కుమార్‌ను సత్కరిస్తున్న దృశ్యం

ఈద్-ఉల్ ఫితర్‌కు ముస్తాబైన జమాలుల్లా ఈద్గా



ఈద్గాను పరిశీలిస్తున్న వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ ఖాన్

రాయచోటి టౌన్, మార్చి30(ఆంధ్రజ్యోతి): రంజాన్ సందర్భంగా నిర్వహించే ఈద్-ఉల్-ఫితర్ ప్రార్థనలకు రాయచోటి పట్టణంలోని పాత రాయచోటికి సమీపంలో గల హజరత్ జమాలుల్లా ఈద్గాను గౌరవ ప్రెసిడెంట్ బేపారి బషీర్ ఖాన్ ఆధ్వర్యంలో సర్వాంగ సుందరంగా తర్చిదిద్దినట్లు వర్కింగ్ ప్రెసిడెంట్ బేపారి మహమ్మద్‌ఖాన్ పేర్కొన్నారు. ఈద్గాలో సోమవారం జరగవోవు ప్రార్థనల కోసం చేపడుతున్న పనులను మైనార్టీ నేతలతో కలిసి వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ముస్లింలు జరుపుకునే ముఖ్యమైన పండుగ రంజాన్ అని, ముస్లింలు పవిత్ర ఉపవాసాలతో గడిపే రంజాన్ నెలకు ముగింపు రోజున మత గురువు ఆధ్వర్యంలో ఈద్-ఉల్-ఫితర్ ప్రార్థనలను పవిత్రంగా జరుపుకొంటారన్నారు. ముస్లిం మత గురువు సర్కాజీ సర్ఫుద్దీన్ ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకే ప్రార్థనలు ప్రారంభిస్తారన్నారు. ఉదయం 7 గంటల నుంచి 7.30కు ఈద్గాలోకి చేరుకోవాలని కోరారు. వయసు పైబడిన వారు గొడుగులు వెంట తెచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు అన్నా సలీం, బేపారి జబీలుల్లాఖాన్, గౌస్‌బేగ్, ఖలీల్‌బేగ్, బేపారి అసద్‌ఖాన్, ముజఫర్‌ఫైజాన్, రిజ్వాన్, ఖాదర్‌ఖాన్, షామీర్ తదితరులు పాల్గొన్నారు.

మంచాలమ్మను దర్శించుకున్న చమర్తి



మంచాలమ్మ తిరునాళ్లలో పాల్గొన్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

నందలూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి):మండలంలోని ఆడపూరు గ్రామస్థుల ఆహ్వానం మేరకు ఆదివారం మంచాలమ్మ అమ్మవారిని అన్నమయ్య జిల్లా టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయనను తిరునాల నిర్వాహకులు శాలువా కప్పి పూలమాల వేసి ఘనంగా సన్మానించారు.అనంతరం అదే గ్రామానికి చెందిన నాగేష్‌నాయుడు ఇచ్చిన విందు కార్యక్రమంలో పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ కార్డులు పంపిణీ

రామాపురం, మార్చి30(ఆంధ్రజ్యోతి): నీలకంఠ్రావుపేటలో టీడీపీ సభ్యత్వం కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రామాపురం మండలం యువనాయకుడు యూనిట్ ఇన్‌చార్జి మహబూబ్‌బాషా, 40, 41 భూత్ ఇన్‌చార్జి ఐటీడీపీ నాగభూషణ్‌రెడ్డి, నియాజ్, సయ్యద్‌పీరా, రాజా, ఖాదర్‌బాషా, మండల టీడీపీ నాయకులు ఎంఎల్ వెంకట్రామిరెడ్డి, ధనుంజయ, కోటిరెడ్డి పాల్గొన్నారు.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రి



ఎక్స్‌రే యంత్రం

● రైల్వేకోడూరు ఆస్పత్రికి అధునాతన పరికరాలు ● త్వరలో రోగులకు అందుబాటులోకి..

రైల్వేకోడూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిని ప్రైవేటు ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వం సిద్ధం చేస్తోంది. రైల్వేకోడూరు ప్రభుత్వ పాత ఆస్పత్రి అలానే ఉంచిన ప్రభుత్వం ఏడాది క్రితం సుమారు రూ. 12 కోట్లతో 50 పడకల ఆస్పత్రి నిర్మించింది. ఇందులో మొదట రక్త పరీక్షలు చేసే పరికరాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వైద్యవిధాన పరిషత్ వారు ఫుల్లీ ఆగో అనలైజర్ (వివిధ రకాల పరీక్షలు చేసే యంత్రం) పంపారు. ఇందుకోసం ఒక కంప్యూటర్‌తో పాటు వాటర్ ఫిల్టర్స్ పంపారు. వీటిని ల్యాబ్‌లో అమర్చారు. టెక్నీషియన్ వచ్చి ఇన్‌స్టాల్ చేయాల్సి ఉంది. ఈ పరికరంతో 300 రకాల పరీక్షలు చేయవచ్చు. కిడ్నీ పరీక్షలు చేసే విధంగా అధునాతన యంత్రం అందుబాటులోకి వస్తోంది. ఎక్స్‌రే మిషన్ వచ్చింది. దీని సీఆమ్ అనే పరికరం రావాల్సి ఉంది. కొన్ని రోజుల్లో ఇవి రోగులకు అందుబాటులోకి రానున్నాయి. కొత్తగా ఏర్పాటు చేసిన ఆస్పత్రిలో శవపరీక్ష గది కూడా ఏర్పాటు చేశారు. క్యాంటీన్, సెక్యూరిటీ తదితరాలు నిర్మించారు. ఆస్పత్రికి రోజుకు 300 మందికి పైగా రోగులు వస్తుంటారు. అన్నిరకాల మందులు రోగులకు అందుబాటులో ఉన్నాయి. కుక్క, పాము కాటుకు కూడా మందులు రోగులకు అందుబాటులో ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు. గుండె పోటుకు గురైన వారిని కాపాడడానికి రూ. 40 వేలు విలువ చేసే ఇంజక్షన్ ఆస్పత్రిలో సిద్ధంగా ఉంటుందని వైద్యులు తెలిపారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో వేలకువేలు పోగొట్టుకోకుండా, ప్రజలు ప్రభుత్వ ఆస్పత్రిలో ని సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు అంటున్నారు.


రైల్వేకోడూరు ఆస్పత్రికి చేరిన అధునాతన యంత్రం

ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్యం



ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్యం రోగులకు అందుతోంది. అన్ని రకాల మందులు ఉన్నాయి. ఎక్కడ లోపాలు లేకుండా చేస్తున్నాం. ఎక్కడ సమస్యలు లేకుండా చేస్తున్నాం. గుండె పోటుకు గురైన వారికి అత్యవసరంగా ప్రాణాలను కాపాడానికి రూ.40 వేలు విలువ చేసే ఇంజక్షన్ ఉచితంగా వేస్తాం.

- బ్రహ్మకుమారి, ప్రధాన వైద్యురాలు

అనేక జబ్బులు గుర్తించవచ్చు



అధునాతన పరికరాలతో అనేక జబ్బులను గుర్తించ వచ్చు. ఇప్పటికే అనేక కొత్త పరికరాలు వచ్చాయి. వీటిని త్వరలో అందుబాటులోకి తీసుకుని వస్తాము. ప్రైవేటు ఆస్పత్రిలో వేలకు వేలు ఖర్చయ్యే పరీక్షలు, ఇక్కడ ఉచితంగా చేస్తున్నాం. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

- అబ్దుల్ రషీద్, ల్యాబ్ టెక్నీషియన్

సంస్కృతి సంప్రదాయాలే మన వారసత్వ సంపద

కడప ఎడ్యుకేషన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): భారతదేశం సంస్కృతి సంప్రదాయాలకు నిలయమని, అదే మన నిజమైన వారసత్వ సంపదని తిరుమల - తిరుపతి దేవస్థానాల వైదిక యూనివర్సిటీ డీన్ డాక్టర్ రాజేష్‌భట్టర్ అన్నారు. ఆదివారం కడప నగరం మానస సమావేశ మందిరంలో భారత జాతీయ కళా సంస్కృతి వారసత్వ పరిరక్షణ సంస్థ (ఇంటెక్) ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు విజయ్ భట్టర్ పంచాంగ పఠనం చేశారు. ఇంటాక్ జాతీయ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు లయన్ కె.చిన్నపరెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్షుడు ఎ. వెంకటసుబ్బయ్య, పూర్వ అధ్యక్షుడు డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి, పోతుల వెంకటరామిరెడ్డి తో పాటు ఆ సంస్థల సభ్యులు వేద పండితులను ఘనంగా సత్కరించారు. అనం తరం సంస్థ పురోభివృద్ధిలో తోడ్పాటునందిస్తున్న సభ్యులందరినీ పోతుల ట్రస్టు ఆధ్వ ర్యంలో ఘనంగా సత్కరించారు. జ్ఞాపిక లను అందజేశారు.

అంకాలమ్మ ఆలయానికి వెండి ముఖ కవచాలు అందజేత

పులివెందుల , మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ఉగాది సందర్భంగా స్థానిక అంకాలమ్మ ఆలయం లోని అమ్మవార్లకు పల్లె వెంకట అశోక్‌కుమార్‌రెడ్డి కుటుంబ సభ్యులు, మిట్ట మల్లికార్జునశెట్టి కుటుంబ సభ్యులు మిట్ట కరుణాకర్, మిట్ట మంజునాథ్, గండి దేవస్థాన ఏఈ నిఖిల్ కుటుంబ సభ్యులు సంయుక్తంగా మూడు కిలోల వెండి కవచాలను సమర్పించారు. ఆలయ చైర్మన్ నాగేంద్ర ప్రసాద్, ఈవో కేవీ రమణలకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు సురేశ్ దాతలతో కలిసి మంగళ వాయిద్యాల నడుమ ఆలయం చుట్టూ అమ్మవారి వెండి కవచాలతో ప్రదక్షిణలు చేశారు. అనంతరం అమ్మవార్లకు అలంకరిం చారు. ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు.


వెండి కవచాలతో ప్రదక్షిణ చేస్తున్న దాతలు

రాయచోటి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తనిఖీ

రాయచోటిటౌన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ప ట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఆ దివారం అనంతపురం జిల్లా రిజిస్ట్రార్ అన్నమ య్య జిల్లా ఇన్‌చార్జి రిజిస్ట్రార్ శ్రీనివాసులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. భూములు, స్థలాలు రిజిస్టర్ చేసే ముందు ఒకటికి రెండు సార్లు పరిశీలించి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు లేకుండా చూసుకోవాలన్నారు. రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు.


రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసులు


ముంబై ఐఐటీలో తెలుగుతేజం

రాయచోటిటౌన్, మార్చి30(ఆంధ్రజ్యోతి): ముంబై గడ్డ తెలుగోడి అడ్డా అని నిరూపించాడు మురికినాటి సాయిదివ్యతేజరెడ్డి. రాయచోటి పట్టణ పరిధిలోని చెన్నముక్కపల్లెకు చెందిన మురికినాటి శ్రీనివాసులరెడ్డి కుమారుడు సాయిదివ్యతేజరెడ్డి ముంబై ఐఐటీలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఆ విద్యాసంస్థలో జరిగిన యూజీ సోషల్ సెక్రటరీ ఎన్నికల్లో ఘనవిజయం సాధించి తెలుగువారి సత్తా చాటాడు. ఐఐటీ బొంబాయి చరిత్రలో మొట్టమొదటి సారిగా ఒక తెలుగువాడు ఎన్నిక కావడం గర్వకారణం. ఇంతటి ఘనవిజయాన్ని సాధించిన సాయిదివ్యతేజరెడ్డికి ప్రముఖుల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.


సాయి దివ్యతేజరెడ్డి

మామిడి తోటకు నిప్పు

గాలివీడు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): అకతాయిలు నిప్పు పెట్టడంతో మామిడి చెట్లు, డ్రిప్పు పైపులు దగ్ధమయ్యాయి. గోపనపల్లె పంచాయతీ సిద్దవాండ్లపల్లె నివాసి వెంకట్రమణకు చెందిన 8 ఎకరాల మామిడి తోటకు ఆదివారం ఆకతాయిలు నిప్పంటించారు. దీంతో 30 మామిడి , 5 కొబ్బరి చెట్లు , 10 నేరేడు చెట్లతో పాటు 5 పైపులు, 50 మీటర్ల మోటారు వైరు , స్టార్టర్, 10 మీటర్ల కేబుల్ వైరు కాలిపోయాయని బాధితుడు తెలిపాడు. సమాచారం అందుకుని తాము వెళ్లేలోగా ఇవన్నీ కాలిపోగా, మిగిలినవాటిని కాపాడుకున్నామని తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఏదైనా సహాయం చేయాలని వారు కోరారు.



కాలిపోయిన మామిడి చెట్లు

చికిత్స పొందుతూ మహిళ మృతి

కడప క్రైం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కడప నగరం అక్కాయపల్లెలో నివాసం ఉంటున్న ఓ మహిళ కడప రిమ్స్‌లో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందినట్లు తాలుకా సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. కర్నూలు జిల్లా దేవనకొండ మండలం బండపల్లికి చెందిన వడ్డె లక్ష్మీదేవి (32) భర్త రాముడు ఒకటిన్నర సంవత్సరం క్రితం జీవనోపాధి కోసం కడపకు వచ్చారు. అక్కాయపల్లెలో ఇల్లు అద్దెకు తీసుకుని పనులకు వెళుతుండేవారు. ఏడాది క్రితం నుండి ఆమె కడుపు నొప్పితో బాధపడుతుండేదని, శనివారం రాత్రి కడుపునొప్పి రావడంతో భర్త ట్యాబ్లెట్ల కోసం బయటికి వెళ్లాడు. ఆ సమయంలో ఆమె తలకు పూసుకునే రంగు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. తిరిగి వచ్చిన భర్త ఇది గమనించి రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

తాటివనంలో అగ్ని ప్రమాదం

కమలాపురం రూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఆకతాయిలు నిప్పం టించడంతో ఆదివారం రాత్రి మం డలంలోని రామచంద్రపురం సమీ ప ఫారెస్టు ఏరియా తాటివనంలో మంటలు ఎగసిపడుతున్నాయి స్థా నికులు ఫైర్‌స్టేషనుకు సమాచారం ఇవ్వగా ఫైర్‌ఇంజను అందుబాటు లో లేనట్లు తెలిసింది.


తాటివనంలో ఎగసిపడుతున్న మంటలు

బస్సు ఢీకొనడంతో ఒకరికి గాయాలు

సిద్దవటం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనాన్ని బస్సు ఢీకొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు ప్రదీప్ కుమార్ రెడ్డి అనే వ్యక్తి ఆదివారం సాయంత్రం మండల కేంద్రంనుంచి చంటిగారిపల్లెకు బైక్‌పై వెళుతుండగా ప్రధాన రహదారి మలుపు వద్ద కడప నుంచి బద్వేలు వైపు వెళుతున్న ఆర్టీసీ హైర్డ్ బస్సు ఢీకొంది. దీంతో తలకు, ఎడమకాలుకు బలమైన గాయాలు తగిలిన అతనిని 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఇద్దరు సీఎంలున్నా నీటి సమస్య పట్టించుకోలేదు

● ఏప్రిల్ 15 నాటికి పరిష్కారం
● వేంపల్లెలో బోర్లను ప్రారంభించిన బీటెక్ రవి

వేంపల్లె, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): పులివెందుల ప్రాంతంలో ఇద్దరు ముఖ్యమంత్రులు పని చేశారని, పాడా పథకం కింద వేల కోట్లు ఖర్చు చేశారని, అయినా పులివెందుల నియోజకవర్గంలో తాగునీటి సమస్య తీరలేదని పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి తెలిపారు. వేంపల్లెలోని రాజీవ్‌నగర్ కాలనీ, పులివెందుల రోడ్డులోని శ్లోకస్కూల్ సమీపంలో ఏర్పాటు చేసిన బోర్లను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేంపల్లెలో తాగు నీటి సమస్య పరిష్కారానికి ఎక్కడ అవసరమైతే అక్కడ బోర్లు వేయాలని స్థానిక అధికారులకు, నాయకులకు సూచించారు. గతంలో ముఖ్యమంత్రులుగా పని చేసి వైఎస్ జగన్, ఆయన తండ్రి ప్రజల సమస్యలు, ముఖ్యంగా తాగునీటి సమస్య పరిష్కారంపై దృష్టి పెట్టలేదన్నారు. జల్ జీవన్ కింద ఏప్రిల్ 15 నాటికి చక్రాయపేట మండలం మినహా మిగిలిన మండలాల్లో తాగునీటి సమస్యకు పరిష్కారం చూపుతామన్నారు. మండల పరిశీలకుడు రఘునాథరెడ్డి,మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్, మండల కన్వీనర్ మునిరెడ్డి, యువ నాయకులు నామా వేమకుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు రామగంగిరెడ్డి, మైనార్టీ నాయకులు షరీఫ్, తెలంగాణ వలి, మడక శ్రీనివాసులు, ఎద్దుల శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


తాగునీటి బోరును ప్రారంభిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి, టీడీపీ నాయకులు

మూడేళ్లలో హత్య కేసు పరిష్కారం

● రాచమల్లు రాజీనామా చేస్తాడా ?

వేంపలె : ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు రెండు మూడేళ్లలో కోర్టు తేల్చే అవకాశం ఉందని పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి తెలిపారు. వేంపల్లెలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వివేకా హత్య కేసులో అవినాశ్‌రెడ్డి ప్రమేయం ఉందని తెలిస్తే ఎమ్మెల్యేలమంతా మూకుమ్మడిగా రాజీనామా చేస్తామని గతంలో ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి చెప్పాడని గుర్తు చేశారు. కేసులో ప్రమేయం ఉన్నట్లు అవినాశ్‌రెడ్డిపై కేసు నమోదైనా రాజీనామా చేయలేదని, కేసు నిరూపితమై జైలుశిక్ష పడితే రాజీనామా చేస్తానని శివప్రసాద్ చెప్పినపుడు అభ్యంతరం చెప్పి, అపుడు మీరు ఎక్కడుంటారో ఎవరికి తెలుసునని, కేసు నమోదైతే రాజీనామా చేస్తావా? అని ప్రశ్నించానని బీటెక్ రవి అన్నారు. సునీల్‌యాదవ్ ఇటీవల ఇచ్చిన స్టేట్‌మెంట్‌లో వాస్తవం ఉన్నట్లుందన్నారు. అందరి పాత్రలు ఆ సినిమాలో లేవని ఆయన చెప్పారని, కొన్ని పాత్రలనే పెట్టడం, మిగతావారి ప్రమేయం లేదంటూ సునీల్‌యాదవ్ చెప్పింది వాస్తవమేనన్నారు. హత్య కేసుకు సంబంధించి ఇటీవల జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో కేసు త్వరగా తేలుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

ఓటమితో రాచమల్లుకు మతి పోయింది

ప్రొద్దుటూరు , మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ఓటమిని జీర్ణించుకోలేక మతి చెడిపోవడంతోనే వైసీపీ నాయకుడు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి ఎమ్మెల్యే వరద రాజులరెడ్డిపై అవాకులు చవాకులు మాట్లాడుతున్నాడని టీడీపీ నాయకుడు రిటైర్డ్ సబ్ ఇన్‌స్పెక్టర్ శంకర్ ఆరోపించారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గోపవరం ఉపసర్పంచ్ ఎన్నికల కోసం వరదరాజులరెడ్డి రభస చేశాడని మాట్లాడుతున్నావు. గతంలో నీ పార్టీలో ఉన్న శివచంద్రారెడ్డి కొడుకు మత్స్య కాలనీకి వార్డు మెంబరుగా పోటీ చేస్తే నీవెందుకు పోటీ నిలబెట్టి కోట్లు ఖర్చు పెట్టి ఓటమి పాలయ్యావని ప్రశ్నించారు. ఎమ్మెల్యేగా ఉండి కేవలం ఒక వార్డు మెంబరుకు పోటీ ఎందుకు పెట్టించి ఓడిపోయావన్నారు. బీసీలకు ఉప సర్పంచ్ పదవి ఇస్తానని చెప్పి మోసం చేశావు కాబట్టి బీసీలకు న్యాయం చేయడం కోసం వరదరాజులరెడ్డి గోపవరం ఉపసర్పంచు ఎన్నికల్లో జోక్యం చేసుకున్నాడన్నారు. టీడీపీ బీసీ నాయకుడు పగిడాల దస్తగిరి మాట్లాడుతూ రాచమల్లు ప్రసాద్ రెడ్డి వార్డు మెంబర్లకు రూ.10 లక్షలు డబ్బు, మూడు సెంట్ల స్థలం ఇస్తానని చెప్పి మాట తప్పాడన్నారు. ఓట్లేసి రండి.. డబ్బులు ఇస్తానని చెప్పి.. ఆయన బంధువైన ఎన్నికల అధికారి రామాంజనేయుల రెడ్డికి చెప్పి వాయిదా వేయించాడన్నారు. పెద్దాయనతో పోరాడే ముందు తమతో ఢీకొనాలని సవాల్ విసిరారు. ప్రాణ భయంతోనే నేటికీ ఇంటి చుట్టూ కరెంట్ పెట్టుకున్నాడని విమర్శిం చారు. నాడు ప్రవీణ్ రెడ్డిపై దాడి చేసి.. అతే మంచి వాడంటాడ న్నారు. లింగారెడ్డిని అవమానించిన ఆయన నేడు లింగారెడ్డిని పొగుడుతున్నాడ న్నారు. ఆయన జిత్తుల మారి వైఖరిని ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. సమావేశంలో మాజీ కౌన్సిలర్ తలారి పుల్లయ్య, రామకృష్ణ , కేశవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రిటైర్డ్ ఎస్ఐ శంకర్, పగిడాల దస్తగిరి

మత సామరస్యానికి ప్రతీక కడప జిల్లా

● ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్

కడప క్రైం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): హిందూ, ముస్లింలు కడప జిల్లాను మత సామరస్యానికి ప్రతీకగా నిలిపారని ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ తెలిపారు. రంజాన్‌ను పురస్కరించుకుని స్థానిక ఉమేశ్‌చంద్ర స్మారక కల్యాణ మండపంలో ఆదివారం సాయంత్రం జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో పోలీసుశాఖలోని ముస్లిం పోలీసు అధికారులు, సిబ్బందికి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ ఇఫ్తార్ విందును స్వీకరించారు. అమీన్‌పీర్ దర్గా ఇమామ్ ఇనయతుల్లా ప్రార్థన చేయించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఇఫ్తార్ విందు మత సామరస్యాన్ని చాటిందని, ఈ విందులో నగరంలోని ముస్లింలు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారన్నారు. తాను గతంలో కడప డీఎస్పీగా ఉన్నప్పుడు వినాయక చవితి, బక్రీదు, ఉగాది, రంజాన్ పండుగల సమయంలో హిందూ ముస్లిం లు అందించిన సహకారం మరువలేనిదన్నారు. ఉగాది సందర్భంగా దేవునికడప ఆలయంలో ముస్లింలు పూజలు నిర్వహించడం, అమీన్‌పీర్ దర్గాను హిందువులు దర్శించుకోవడం మతసామరస్యానికి నిదర్శనమన్నారు. అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ రమణయ్య, నగరంలోని ముస్లిం ప్రముఖులు, వన్‌టౌన్ సీఐ రామకృష్ణ, టూటౌన్ సీఐ నాగార్జున, చిన్నచౌకు సీఐ ఓబులేసు, ఆర్‌ఐలు వీరేశ్, శ్రీశైలరెడ్డి, శివరాముడు, చిన్నచౌకు ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి, టూటౌన్ ఎస్ఐ ఎస్‌కేఎం హుసేఉన్, రిమ్స్ ఎస్ఐ జయరాముడు, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేశ్, పోలీసు సిబ్బంది, నగరంలోని ముస్లిం సోదరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


కడప: ముస్లింలకు భోజనం వడ్డిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

రాయచోటిలో ఘనంగా ఉగాది సంబరాలు

రాయచోటిటౌన్ : ఆరు రుచుల సమ్మేళనం ఉగాది పచ్చడి అని, జీవితంలో కష్టసుఖాలు, కలిమిలేములకు ఇది ప్రతీక అని, ఈ ఉగాది పండుగ మీ జీవితాల్లో సుఖ సంతోషాలు నింపాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆ కాంక్షించారు. ఆదివారం విశ్వావసు నామ సంవత్సరం ఉగాది వేడుకను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ దంపతులు సంప్రదాయ దుస్తుల్లో వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం పోలీసు అధికారులకు, సిబ్బందికి ఉగా ది పచ్చడి, ప్రసాదం అందజేసి, భోజనాలు వడ్డించారు. అనంతరం పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి గ్రూప్ ఫొటో దిగి అందరిలో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో కొత్త కొత్త ఆశలతో ముందుకు వెళ్లాలని కోరుతూ జిల్లా ప్రజలకు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు, పోలీసు అధికారులకు, పోలీసు సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పూజారి పంచాంగం చదివి వినిపించారు.


రాయచోటి:ఉగాది సందర్భంగా సిబ్బందికి భోజనాలు వడ్డిస్తున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు దంపతులు

ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు

రంజాన్ పండుగను ముస్లింలు సంతృప్తి, సంతోషాలతో జరుపుకోవాలంటూ ఎస్పీ ఆకాంక్షించారు.. రంజాన్ సందర్భంగా సోమవారం సెలవు దినంగా ప్రకటించినందున ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేశామని, ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని విజ్ఞప్తి చేశారు.
ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) ఎం.వెంకటాద్రి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు వీజే రామకృష్ణ, యం. పెద్దయ్య, రాయచోటి అర్బన్ సీఐ జీవీ చలపతి, ట్రాఫిక్ సీఐ ఎస్. విశ్వనాథ రెడ్డి, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ హత్యపై న్యాయవిచారణ జరిపించాలి

కమలాపురం రూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి):పాస్టర్ ప్రవీణ్ హత్యపై న్యాయ విచారణ జరిపించాలని పాస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు సునీల్‌దత్తు తెలిపారు. ఆదివారం రాత్రి పాస్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రైస్తవులు స్థానిక చావిటికాడి నుంచి మూడురోజుల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని పాస్టర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు.

'మైనార్టీలు, దళితులకు రక్షణ కరువైంది'

కడప నాగరాజుపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో మైనార్టీలు, క్రైస్తవులకు, దళితులకు రక్షణ కరువైందని దళితఫోరం నేత బూసిపాటి కిశోర్ ఆందోళన వ్యక్తం చేశారు. కడప నగరంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ పాస్టర్ పగడాల ప్రవీణ్ అనుమానాస్పద స్థితిలో మృతిచెందితే పోస్టుమార్టం నిర్వహించే విషయంలోను పోలీసులు, ప్రభుత్వం చాలా నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. ఈ సమావేశంలో అఖిలభారత అంబేడ్కర్ సేన రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యుడు పెంచలయ్య పాల్గొన్నారు.

జిల్లావాసులకు ఉగాది పురస్కారాలు

వేంపల్లె, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన పలువురు ప్రముఖులకు ఉగాది పర్వదినం సందర్భంగా ఆదివారం విజయవాడలోని తుమ్మల కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉగాది పురస్కారాలతో సన్మానిం చారు. ఈ సందర్భంగా వేంపల్లె పట్టణానికి చెందిన ప్ర ముఖ కథా రచయిత వేంపల్లె షరీఫ్ ఉగాది పురస్కారం తోపాటు రూ.10వేల నగదు, జ్ఞాపిక అందుకున్నారు.
మైదుకూరు రూరల్ : మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని మామిళ్లపల్లెకు చెందిన రైతు పందిటి కృష్ణమూరి నూతన పద్ధతుల్లో వ్యవసాయం చేస్తూ అధిక దిగుబడి సాధించారు. దీంతో ఆయనకు సీఎం శాలువా కప్పి, జ్ఞాపికతో పాటు రూ. 5 వేల నగదు బహుమతిని అందజేశారు.
బద్వేలు : బద్వేలుకు చెందిన ప్రముఖ సాహితీవేత్త హనుమంతరావుకు ఉగాది పురస్కారం తో పాటు పాటు శాలువ, తెలుగుతల్లి ప్రతిమ, పదివేల రూపాయలు నగదుతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, సాంస్కృతిక శాఖమంత్రి కందుల దుర్గేష్, సహస్రావధాని డాక్టర్ మాడుగులఫణిశర్మ తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో ఉగాది సంబరాలు


డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు

కడప కల్చరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి):ఉగాది పర్వదినం సందర్భంగా నగరంలోని శిల్పారామంలో సంప్రదాయ సాంస్కృతిక కళా వేదికపై పరిపాలనాధికారి కృష్ణప్రసాద్ పర్యవేక్షణలో ఆదివారం నగరంలోని సాయిరాం ఇంగ్లిషు మీడియం స్కూల్ విద్యార్థులు జానపద, సినీ గీతాలకు చేసిన నృత్యాలు కరతాళ ధ్వనులందుకున్నాయి.

ఓగూరమ్మకు బోనాలు

పెనగలూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఈటమాపురంగుంజనేటి మామిడి తోటలో వెలసిన పట్టపురాయి ఓగూరమ్మ గ్రామదేవతకు ఆదివారం ఉగాది పండుగ సందర్భంగా గ్రామస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు కుంకుమ పూజలో పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఇదే గ్రామంలో హరిజనవాడలోని గంగమ్మకు పొంగళ్లు నిర్వహించారు. కంబాలకుంట, పొందలూరు హరిజనవాడల్లో గంగమ్మకు పొంగళ్లు సమర్పించారు.


ఈటమాపురం రేణుకా ఎల్లమ్మకు బోనాలు తీసుకువెళుతున్న మహిళలు

ఘనంగా ఉప్పలపాటి గంగమ్మ జాతర

ఓబులవారిపల్లె, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొర్లకుంట గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ఉప్పలపాటి గంగమ్మ, ఓబులవారిపల్లె గ్రామ పంచాయతిలో ఉన్న ఏకవీరమ్మ ఆలయంలో ఘనంగా జాతర నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున మొక్కులు చెల్లించుకున్నారు. జాతరకు హాజరైన భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా కళాకారులు ప్రదర్శించిన చెక్కభజన, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.


మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

నిప్పుతో చెలగాటం

● రామసముద్రంలో వరుసగా ఆస్తులకు నిప్పు పెడుతున్న దుండగులు ● లోపించిన శాంతి భద్రతలు

మండలంలో 20రోజులుగా దుండగులు వరుసగా ప్రత్యర్థుల ఆస్తులకు నిప్పు పెడుతూ నిప్పుతో చెలగాటం ఆడుతున్నారు. రామసముద్రాన్ని రావణకాష్టంగా మారుస్తూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు. దీంతో ప్రజలు భయంభయంగా జీవనం సాగిస్తున్నారు. దీంతో మండలంలో శాంతి భద్రతలు లోపించాయని పలువురు చర్చించుకుంటున్నారు.


ఈనెల 4న గడ్డివామికి నిప్పు పెట్టిన దుండగులు

రామసముద్రం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మండలంలో ఈనెలలోనే వరుసగా మూడు అగ్ని ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. మండల కేంద్రంలోని రైతులు భరత్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డిలకు మరో సామాజిక వర్గానికి చెందిన కొందరి మధ్య భూవివాదాలు ఉన్నాయి. ఈ విషయమై ఇరువర్గాలపై కేసులు కూడా ఉన్నాయి. భరత్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి అను రైతులు టీడీపీ మండల అధ్యక్షుడు విజయకుమార్‌గౌడ్‌కు వరుసకు తమ్ముళ్లు అవుతారు. ఈ నేపథ్యంలో ఈనెల 4న భూ తగాదాలకు సంబంధించిన ఓ సామాజిక వర్గానికి చెందిన గడ్డివామికి గుర్తుతెలియని వ్యక్తులు రాత్రివేళలో నిప్పు పెట్టారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఈనెల 10న రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు టీడీపీ మండల అధ్యక్షుడు విజయకుమార్‌గౌడ్‌కు చెందిన ఇన్నోవా కారును ఇంటి ముందు నిలిపి ఉండగా దుండగులు నిప్పు పెట్టారు. సుమారుగా రూ.8లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. ఈ విషయమై విజయ్‌కుమార్‌గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈరెండు సంఘటనలు మరువక ముందే ఈనెల 26న భరత్‌రెడ్డికి చెందిన వ్యవసాయ పొలంలో ఉన్న షెడ్‌కు దుండగులు నిప్పు పెట్టి పోలీసులకు సవాల్ విసిరారు. షెడ్‌లోని వ్యవసాయ పనిముట్లు కాలి బూడిదయ్యాయి. ఒక ద్విచక్ర వాహనం, స్ప్రేయర్, నూరు మీటర్ల స్ప్రేయర్ వైరు, పది కట్టల మల్చింగ్ పేపర్, టమోటా మొక్కలకు ఉపయోగించే నీమ్ ఆయిల్ అగ్నికి ఆహుతి అయ్యాయి. వీటి విలువ రూ.లక్షలకు పైగా ఉంటుందని రైతు అంటున్నారు. యధావిధిగా బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇలా ఉండగా వరుసగా దుండగులు వ్యక్తుల ఆస్తులకు నిప్పు పెడుతూ ఉండడంతో మండల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కాగా కారు దహనం కేసులో గుంతపేటకు చెందిన నిందితుడు శ్రీనివాసులును పోలీసులు శనివారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. మిగిలిన గడ్డివామి, షెడ్ దహనానికి పాల్పడిన నిందితులను పోలీసులు గుర్తించాల్సి ఉంది. కారు దహనానికి నిరసనగా విజయకుమార్‌గౌడ్‌కు సంఘీభావంగా మండల కేంద్రంలో ఈనెల 10న దుకాణదారులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసి బంద్ పాటించారు. మండలంలో శాంతి భద్రతలు లోపించాయనడానికి ఇంతకంటే నిదర్శనం ఏమి కావాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ సంఘటనల వెనుక రాజకీయ కోణం ఉన్నట్లు కూడా ఊహాగానాలు ఉన్నాయి. ఎన్నికలకు ముందు నుండి టీడీపీలో వర్గపోరు నడుస్తోంది. ఏదేమైనా పోలీసు అధికారులు నిందితులను త్వరలోనే పట్టుకుని శాంతిభద్రతలు నెలకొల్పి ప్రజల్లో భయాందోళనలు తొలగించాల్సిన అవసరం ఉందని పలువురు చర్చించుకుంటున్నారు.


ఈనెల 20న రైతు భరత్‌రెడ్డికి చెందిన షెడ్‌కు నిప్పు పెట్టిన దుండుగులు


ఈనెల 10న టీడీపీ మండల అధ్యక్షుడి ఇన్నోవా కారుకు నిప్పుపెట్టిన దుండగులు


అగ్నిప్రమాదాలకు నిరసనగా మండలకేంద్రంలో బంద్ పాటించిన దృశ్యం

తాగునీటి సమస్య తీర్చాలని విజయ్‌కుమార్‌గౌడ్‌ను కోరుతున్న గ్రామస్థులు



తాగునీటి సమస్యను తీర్చండి

● టీడీపీ మండల అధ్యక్షుడికి విన్నపం

రామసముద్రం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్.నడింపల్లె గ్రామ పంచాయతీ శ్రీరాములపల్లె గ్రామంలో నెల రోజులుగా తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, పలుమార్లు అధికారులకు తెలిపినా స్పందించడం లేదని ఆ గ్రామ ప్రజలు వాపోయారు. ఆదివారం ఖాళీ బిందెలతో తాగునీటి సమస్యను పరిష్కరించాలని టీడీపీ మండల అధ్యక్షుడు విజయకుమార్‌గౌడ్ ఇంటి ముందు నిరసన తెలిపారు. వారం క్రితం గ్రామస్థులంతా చందాలు వేసుకుని తాగునీటి బోరు మోటారుకు మరమ్మతులు కూడా చేయించామని, అయినా తాగునీటి సమస్య తీవ్రంగానే ఉందని వాపోయారు. స్పందించి విజయ్‌కుమార్‌గౌడ్ ఎంపీడీవో భానుప్రసాద్‌కు ఫోన్‌లో విషయం తెలుపగా రెండురోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాసగౌడ్, రమేష్, జావీద్, వెంకటరమణ, లక్ష్మన్న, గంగాధర్, బి.వెంకటరమణ, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రేణుకా యల్లమ్మ తిరునాళ్లు

ములకలచెరువు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవళచెరువు పంచాయతీ ఎర్రంరెడ్డిగారిపల్లెలో వెలసిన రేణుకా యల్లమ్మ తిరునాళ్ల సోమవారం నుంచి జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. సోమవారం అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, వివిధ పూజలు, మంగళవారం గొడుగు పూజ, జ్యోతులు, బోనాల సమర్పణ, అమ్మవారి జీవిత చరిత్ర ఆగము, బుధవారం అన్నదానం, అరటిమాను ఎక్కుట, పుష్పపల్లకిలో అమ్మవారి ఊరేగింపు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

లక్కిరెడ్డిపల్లెలో చోరీలను ఆపండి

● పనిచేయని సీసీ కెమెరాలు
● బెంబేలెత్తుతున్న జనం


మూడురోడ్ల కూడలిలో పనిచేయని సీసీ కెమెరాలు

లక్కిరెడ్డిపల్లె, మార్చి30 (ఆంధ్రజ్యోతి): లక్కిరెడ్డిపల్లెలో మూ డేళ్లుగా వరస చోరీలు జరుగుతూనే ఉన్నా దొంగల ఆ చూకీ లభించడం లేదు. ఎందుకంటే స్థానిక మూడు రోడ్ల కూడలిలో సీసీ కెమారాలు అలంకార ప్రాయంగా ఉన్నాయి. అక్కడ ఎనిమిదేళ్ల క్రితం సీసీ కెమారులు అమర్చారు. అవి కనీసం ఏడాది కూడా పనిచేయలేదు. సీసీ కెమెరాలు లేక పోవడంతో ఇక్కడ ఏమి జరిగినా ఎవరికీ తెలియదు. దీంతో వరుస చోరీలు జరుగుతున్నాయి. ఒక్క కార్యాలయంలో కూడా సీసీ కెమారాలు లేవు. దొంగలు దీని ఆసరా చేసుకుని వరస చోరీలకు పాల్ప డుతున్నారు. వ్యాపారులు బెంబేలెల్లుతున్నారు. చోరీలు ఎక్కువగా మెడికల్ షాపుల్లో జరిగాయి. 2022 సెప్టెంబరులో దర్బార్‌బాషా మెడికల్ షాపులో రూ.లక్షా 75 వేలు, మళ్లీ మూడు నెలల తరువాత రూ.60వేలు, మేనెలలో రూ.12000 చోరీ జరిగింది. అదే సం వత్సరంలో డాక్టర్ షఫీనాయక్, ఫరీద్ బాబా మెడికల్ షాపు ల్లో చోరీలు జరిగాయి. నెలక్రితం ఆర్టీసీ బస్టాండ్ వద్ద జనరల్ షాపులో చోరీ జరిగింది. స్థానిక మూడు రోడ్ల కూ డలి, ఆర్టీసీ బస్టాండ్, పోలీసుస్టేషన్ సమీపాన, రామాపురం, కడప రోడ్డులో సీసీ కెమెరాలు అమర్చాలని ప్రజలు కోరుతున్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం

లక్కిరెడ్డిపల్లె మూడు రోడ్ల సర్కిల్, మర్రిచెట్టు, రవీంద్రనగర్, కోనంపేట సర్కిళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అనుమతి లభిం చిన వెంటనే సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం.

- రవీంద్ర, ఎస్‌ఐ

వైభవంగా చౌడేశ్వరీదేవి రాత్రి తిరునాళ్లు


ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరీ అమ్మవారు

మదనపల్లె అర్బన్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): స్థానిక నీరుగట్టువారిపల్లెలోని చౌడేశ్వరీదేవి ఆలయంలో ఆదివారం రాత్రి తిరునాళ్ల వైభవంగా నిర్వహించారు. ఇందులోభాగంగా భక్తులు జ్యోతులను తలపై ఉంచుకుని అగ్నిగుండ ప్రవేశం చేశారు. పురవీధుల్లో జ్యోతులను ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేశారు. రాత్రి అమ్మవారికి పుష్పపల్లకి ఏర్పాటు చేసి చెక్కభజనలు, మంగళవాయిద్యాల నడుమ అమ్మవారి ఊరేగింపు వైభవంగా జరిగింది. భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమాలను ఆలయకమిటీ అధ్యక్షుడు పురాణం చంద్రశేఖర్, కార్యదర్శి బండి పవన్‌కుమార్, ట్రెజరర్ రత్నమయ్య, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు బండి నాగరాజ, రామిశెట్టి నీలకంఠ, ఉప్పు రామచంద్ర, బీజేపీ వెంకటేశ్, డాక్టర్ నారన్నవరం వెంకటేశ్, తొగటివీర క్షత్రియ యువ సంఘం నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా ఉగాది వేడుకలు

వాల్మీకిపురం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టాభిరామాలయంలో టీటీడీ ఆధ్వర్యంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, ఆలయంలోని మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవలతో పూజలు జరిగాయి. ఉత్సవమూర్తులకు విశేషాలంకరణల అనంతరం పంచాంగ శ్రవణం చేశారు. సాయంత్రం తిరుచ్చిపై సీతాలక్ష్మణ సమేత పట్టాభిరాములకు విశేషాలంకరణలు చేసి తిరుచ్చిపై నగరోత్సవం నిర్వహించారు. అలాగే మండలంలోని గండబోయనపల్లె గ్రామంలోని సత్యమ్మతల్లి ఆలయంలో ఉగాది పంచాంగ శ్రవణం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ కార్యక్రమాలు చేపట్టారు. ఉగాది పండుగ సందర్భంగా ప్రజలు తమ పెద్దల సమాదుల వద్ద పూజలు చేసి స్మరించుకున్నారు. కార్యక్రమాలలో ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు, సత్యమ్మ తల్లి ఆలయ ఛైర్మన్ పులి సత్యారెడ్డి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.


తిరుచ్చిపై ఊరేగుతున్న సీతాలక్ష్మణ సమేత పట్టాభిరాముడు

పీలేరు వాసులకు ఉగాది పురస్కారాలు


కలెక్టర్ చేతుల మీదుగా ఉగాది పురస్కారాలు అందుకుంటున్న రెడ్డి గఫార్, జలకనూరి మురళీధర్ రాజు


ఖాదర్ బాషాను సన్మానిస్తున్న రాయలసీమ కళాపీఠం సభ్యులు

పీలేరు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఉగాది సందర్భంగా ఆదివారం జరిగిన సంబరాల్లో పీలేరుకు చెందిన ముగ్గురు మూడు వేర్వేరు రంగాల్లో ఉగాది పురస్కారాలు అందుకున్నారు. రాయచోటిలో జరిగిన ప్రభుత్వ ఉత్సవాల్లో ఉత్తమ రైతుగా కేవీపల్లె మండలం మారెళ్ల గ్రామానికి చెందిన యువరైతు ఎస్.రెడ్డి గఫార్ ఖాన్, పీలేరుకు చెందిన తెలుగు భాషాసమితి అధ్యక్షుడు జలకనూరి మురళీధర్ రాజు కలెక్టర్ చామకూరి శ్రీధర్ చేతుల మీదుగా పురస్కారాలు అందుకున్నారు. అదే విధంగా పీలేరుకు చెందిన బహుబాషా కళాకారుడు, అంతర్జాతీయ మిమిక్రీ ఆర్టిస్ట్ ఖాదర్ బాషా రాజంపేటలో రాయలసీమ కళాపీఠం నిర్వహించిన ఉగాది సంబరాల్లో ఉగాది పురస్కారం, ఘనసన్మానం అందుకున్నారు.

యమలా సుదర్శనానికి ఉగాది పురస్కారం



మదనపల్లె అర్బన్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మాల మహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ యమలా సుదర్శన్‌కు అంబేడ్కర్ సేవారత్న అవార్డును రాష్ట్ర మాలల ఉద్యోగుల సంఘం అందించారు. ఆదివారం ఒంగోలులో రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగానే దళితుల కోసం పోరాటాలు, ఉద్యమాలు చేసిన మదనపల్లెకు చెందిన యమలా సుదర్శన్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాలమహానాడు చిత్తూరు ఉమ్మడి జిల్లాఉపాధ్యక్షుడు గుండా మనోహర్, రామచంద్ర, కృష్ణమూర్తి, మాలల ఉద్యోగుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

'విశ్వావసు'కు స్వాగతం

● భక్తిశ్రద్ధలతో ఉగాది సంబరాలు ● ఆలయాల్లో పంచాంగ శ్రవణం


ప్రజలకు బెల్లం ముద్దలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రెడ్డి

పీలేరు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): తెలుగు నూతన సంవత్సరాది ఉగాదిని పీలేరు మండల ప్రజలు ఆదివారం భక్తిశ్రద్ధలు, ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలు ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తమ పూర్వీకుల సమాధుల వద్ద నివాళులు అర్పించారు. ఆర్ఎస్ఎస్ పీలేరు ఖండ సభ్యులు ఆదివారం సాయంత్రం స్థానిక ఆర్యవైశ్య కళ్యాణమండపంలో పంచాంగ పఠనం నిర్వహించారు. ఒకరికొకరు విశ్వావసు సంవత్సరాది శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పీలేరు పట్టణంలోని పలువురు ముస్లింలు తమ పూర్వీకుల సంప్రదాయాలను గౌరవిస్తూ స్థానిక కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో అర్చకులకు భత్యం చెల్లించి మతసామర్యాన్ని చాటుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు విరూపాక్షం కుమారస్వామి ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు.

కలికిరిలో వసంత నవరాత్రులు

కలికిరి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉగాది పర్వదినాన్ని ఆదివారం వేడుకగా నిర్వహించుకున్నారు. సంప్రదాయం ప్రకారం పరలోగ్రస్తులైన పెద్దల సమాధుల వద్ద పూజలు చేశారు. మండంలోని వివిధ ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. ఇంటిల్లిపాదీ కొత్త బట్టలు, రకరకాల పిండి వంటకాలతో ఉత్సాహంగా పండుగ జరుపుకున్నారు. నగరిపల్లెలో ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి తన తల్లిదండ్రుల సమాధుల వద్ద పూజలు చేశారు. అనంతరం ప్రజలకు బెల్లం ముద్దలు పంచిపెట్టారు. ఇక స్థానిక గ్రామదేవత యల్లమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అంతేగాకుండా ఉగాది రోజు నుంచి తొమ్మిది రోజులపాటు వసంత నవరాత్రుల ఉత్సవాలు ఏర్పాటు చేశారు. మొదటిరోజు ఉగాది పర్వదినాన అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.



బి.కొత్తకోటలో..

బి.కొత్తకోట, మార్చి 30(ఆంధ్రజ్యోతి): విశ్వావసు నామ తెలుగు సంవత్సరం ఉగాది పర్వదినాన్ని బి.కొత్తకోట మండలంలో ఘనంగా జరుపుకున్నారు. నివాసగృహాలలో ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని బీరంగి, గట్టు, బడికాయలపల్లి, గోళ్లపల్లె గ్రామాలలో ఆలయాల వద్ద సందడి నెలకొంది. ఆలయాల్లో పంచాంగశ్రవణం ఏర్పాటు చేశారు. నగరపంచాయతీ కమిషనర్ జీవీ పల్లవి, సీఐ జీవన్‌గంగానాథ్‌బాబు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

నిమ్మనపల్లిలో..

నిమ్మనపల్లి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మండల ప్రజలు విశ్వావసు నామ సంవత్సరం సందర్భంగా ఉగాది పండుగను ఘనంగా నిర్వహించారు. ఆదివారం నేలమల్లేశ్వస్వామి, సీతారామాలయం, సాయిబాబా, అభయాంజనేయస్వామి తదితర ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సంవత్సరంలో వర్షాలు కురిసి పాడిపంటలతో ప్రజలు సుఖసంతోషాలతో వుండాలని కోరుకున్నారు.

గుర్రంకొండలో..


గుర్రంకొండ, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఉగాది పర్వదినాన్ని మండల ప్రజలు ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయాన్నే సాన్నాలు చేసి కొత్త బట్టలను ధరించి ఇళ్లలో ప్రత్యేక పూజలు చేశారు. గుర్రంకొండలో పోలేరమ్మ అమ్మవారిని ఊరేగించారు. అనంతరం మృతి చెందిన పూర్వీకుల సమాధుల వద్ద పూజలను చేసి నివాళులర్పించారు.

కలకడలో..

కలకడ, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మండల ప్రజలు ఉగాది పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఇంటి ద్వారాలను మామిడి తోరణాలు, పూలతో అందంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు చేసి ఉగాది పచ్చడిని పంచిపెట్టారు. సత్యవతి నది తీరాన వెలసిన కామాక్షి సమేత సిద్దేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పంచాంగ శ్రవణం నిర్వహించారు. బాటవారిపల్లెలోని పంచముఖ ఆంజనేయ స్వామి, ఎర్రకోటపల్లె సమీపంలోని కోటమిట్ట ఆంజనేయ స్వామి ఆలయం, కోన చౌడేశ్వరిదేవి అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో అర్చకులు సుబ్రమణ్యం స్వామి, మహేష్, ఆలయ కమిటీ సభ్యులు వెంకట్రమణ నాయుడు, కోనేని రెడ్డెప్పనాయుడు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో..

తంబళ్లపల్లె, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఉగాది పర్వదినాన్ని తంబళ్లపల్లె మండల ప్రజలు ఆదివారం భక్తిశ్రద్ధలతో సంప్రదాయ బద్ధంగా జరుపుకు న్నారు. పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి పంచాంగ శ్రవణం చేశారు. షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడిని పలువురికి పంచిపెట్టారు. విశ్వావసు సంవత్సరానికి స్వాగతం పలికి ఉగాది శుభాకాంక్షలు తెలుపుకున్నారు.


ప్రత్యేక అలంకారంలో కలికిరి యల్లమ్మ తల్లి

కురబలకోటలో..

కురబలకోట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగ వేడుకలను ఆదివారం కురబల కోట, అంగళ్లు, ముదివేడు, మ ట్లివారిపల్లె తదితర గ్రామాల్లో తెలుగు సంప్రదాయాలు ప్రతి బింబించేలా ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భం గా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అనంతరం పండితులు పంచాంగాన్ని చదివి వినిపించారు. అలాగే కుటుంబీకులు, బంధువులతో సందడిగా గడిపారు.

పెద్దమండ్యంలో..

పెద్దమండ్యం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగ సందర్భంగా మండలంలోని పలు దేవాలయాలల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఉగాది పచ్చళ్ల పంచి పెట్టారు. పల్లెల్లో ఉగాది సందడి నెలకొంది. రాత్రి పాపేపల్లి నరసింహ స్వామి ఊరేగింపు నిర్వహించారు. చెక్కభజనలు, కోలాల మధ్య స్వామివారి ఊరేగింపు వైభవంగా జరిగింది.

వృద్ధులకు దుస్తుల పంపిణీ

పెద్దతిప్పసముద్రం మార్చి 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక పీటీఎంకు చెందిన ఆధ్యాత్మికవేత్త ననగరం పట్టాభిరామయ్య ఆదివారం తెలుగుసంవత్సరాది(ఉగాది)ని పురస్కరించుకుని వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం కూడా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బెంగళూరుకు చెందిన శ్రీనివాస్, సురభికృష్ణశర్మ, ఆకుల


కలకడలో పంచాంగ శ్రవణం